RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 17 మార్చ్ 2026 మంగళవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:242

# ఈనెల 30వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

### ౨౦న రాష్ట్ర బడ్జెట్.. బీఏసీ సమావేశంలో నిర్ణయం



హైదరాబాద్ మార్చ్ 16 : తెలంగాణ అసెంబ్లీ , శాసన మండలి బడ్జెట్ సమావేశాలు ఈనెల 30వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ మేరకు సోమవారం స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 31 వరకు నిర్వహించాలని బీఆర్ఎస్ సభ్యులు కోరగా సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కాగా సోమవారం తొలిరోజు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం సమావేశం రేపటికి వాయిదా పడింది. ఈనెల 17,18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, 19న ఉగాది పండుగ సందర్భంగా ఉభయ సభలకు సెలవును ప్రకటించారు. 20న ప్రారంభమయ్యే సమావేశాల్లో అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా ఉభయ సభలకు విరామం, 23 నుంచి సమావేశాలు కొనసాగనున్నాయి. అయితే బీఆర్ఎస్ కోరిక మేరకు ఆదివారం కూడా సమావేశం ఉంటుందని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు.


# రైజింగ్ దిశగా అడుగులేస్తున్న తెలంగాణ

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోంది**

**ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిహెచ్ఎంసి విభజన**

**ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తొలి ప్రసంగం**



హైదరాబాద్ మార్చ్ 16 ;: దేశానికి దిక్సూచీగా మన రాష్ట్రం నిలుస్తుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా కొనియాడారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం అని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తొలి ప్రసంగం చేశారు. తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులేస్తున్నామని, శ్రమించే తత్వంగల శాంతికాముకులు తెలంగాణ ప్రజలు అని తెలియజేశారు. తెలంగాణ పురోగతిలో ప్రతీపౌరుడు భాగస్వామి అని..ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని, ఏడాది కాలంలో సంక్షేమ పథకాలు అందరికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్లుగా, కోర్,ప్యూర్, రేర్ గా తెలంగాణను విభజించామని గవర్నర్ పేర్కొన్నారు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిహెచ్ఎంసి విభజన చేశామని, ప్రజలకు భద్రత, రక్షణ కల్పించేలా 4 కమిషనరేట్లు ఏర్పాటు చేశామని అన్నారు. హిల్ట్ పాలసీతో పరిశ్రమ భూముల బదలాయింపు జరిగిందని, మొదటి దశలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేశామని గవర్నర్ అన్నారు. మూసీలో మురుగునీరు చేరకుండా 39 ఎస్టిపిలు నిర్మాణం జరిగిందని, ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కు అనుబంధంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తామని అన్నారు. 55కి.మీ. మేర మూసీని పునరుజ్జీవింప చేస్తామని, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్ ప్రెస్ వే, బుల్లెట్ ట్రైన్ కు శంషాబాద్ కు కేంద్రంగా మారబోతోందని గవర్నర్ పేర్కొన్నారు. వరంగల్, అదిలాబాద్ కు ఎయిర్ పోర్టులు రాబోతున్నాయని, గ్లోబల్ సమ్మిట్ తో రూ. 5 లక్షల 72 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తెలంగాణను అభివృద్ధిలో గ్లోబల్ హబ్ గా మార్చాలనుకుంటున్నామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం సమయంలో బిఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సభలో నిలబడే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ ప్రసంగాన్నితిలకించారు.

# రేవంత్ రెడ్డి తో ప్రముఖ భారత ఆర్థికవేత్త అర్వింద్ సుబ్రమణియన్ మర్యాదపూర్వక భేటీ



భేటిలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి భట్టి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు.

అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో జరిగిన ఈ భేటీలో వివిధ అంశాలపై చర్చించిన సీఎం

విద్యుత్ రంగం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, +ూ అంశాలపై సుబ్రమణియన్ తో చర్చించిన సీఎం, డిప్యూటీ సీఎం

విద్యుత్ రంగంలో ఖర్చుల నమూనా , స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగంలో నమూనా మూల్యాంకనం, జీఎస్టీలో పన్నుల అంచనా, ఇతర అంశాలపై చర్చ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు పలు కీలక సూచనలు చేసిన సుబ్రమణియన్

ఆర్థిక పరిస్థితి మెరుగుపరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించిన సుబ్రమణియన్.

# తెలంగాణ భవన్ లో ఘనంగా ఇఫ్తార్: కేటీఆర్



హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తెలంగాణ భవన్ (బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం)లో పార్టీ ఘనంగా నిర్వహించిన 'దావత్-ఏ-ఇఫ్తార్' కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదర సోదరీమణులందరికీ ఆయన పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, తనను ఆహ్వానించిన మైనారిటీ నేతలకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని మైనారిటీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మైనారిటీల సంక్షేమం కోసం ప్రకటించిన డిక్లరేషన్‌ను అమలు చేయకుండా వారిని మోసం చేశారన్నారు ఈరోజు నుంచే ప్రారంభమైన తెలంగాణ శాసనసభ సమావేశాల్లో, మైనారిటీ వర్గాలను కాంగ్రెస్ ఏ విధంగా వంచించిందో సాక్ష్యాధారాలతో సహా ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు. అపరిష్కృతంగా ఉన్న ప్రతి హామీ పైన ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని భరోసా ఇచ్చారు.

కేసీఆర్ గారి పది ఏళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం కుల మతాలకు అతీతంగా, గంగా-జమునా తెహజీబ్ సంస్కృతితో అద్భుతంగా ముందుకు సాగిందని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రతి ఒక్కరిని సమానంగా చూస్తూ మత సామరస్యానికి పెద్దపీట వేసిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ ఆశయాలను పక్కన పెట్టడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో మైనారిటీ సోదరులు పాల్గొని ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ా

# క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ

**అర్హులకే ఇళ్లు, అక్రమార్కులకు చెక్**

**నివాసంలో లేని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులకు నోటీసులు**

**ఏప్రిల్ 30వరకు గడువు ,అనర్హుల స్ధానంలో అర్హులకు కేటాయిస్తాం**

**క్యూర్ పరిధిలో హౌసింగ్ పై ,మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నంతో కలిసి మంత్రి పొంగులేటి సమీక్ష**

హైదరాబాద్ :- హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ ( కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని దీనికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.



సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలోగ్గవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అద్దెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్నవారికి నోటీసులు జారీ చేయాలని , నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎంతమంది స్పందించారు అక్కడ నివాసం ఉండకపోవడానికి వారు చెప్పిన కారణాలపై ఆరా తీశారు. 2 బిహెచ్‌కే, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది నివాసం ఉండని ఇళ్లను మే 1వ తేదీ నుంచి పరిశీలించాలని అటువంటి వారికి నోటీసులు ఇచ్చి, స్పందించని పక్షంలో కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులపై స్పందించిన లబ్దిదారుల నుంచి బాండు పేపరుపై తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు.

నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లో ముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ ఆగకుండా పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్దిదారులకు కేటాయించాలన్నారు.

అదేవిధంగా వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అద్దె ప్రాతిపదకన గాకుండా వేలం పద్దతిలో వాటిని విక్రయించాలని ఆ విధంగా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్ పేరిట వేయాలన్నారు. అంతేగాక ప్రజా ప్రయోజన కార్యాలయాల కోసం కూడా కొన్నింటిని కేటాయించాలని తెలిపారు. ఈ విషయంలో సహకార శాఖ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.

ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ, వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాబలం

**17 మార్చ్ 2026 మంగళవారం**


## 5 రాష్ట్రాల్లో గెలుపు ఎవరిది

దేశంలో ఎన్నికల సందడి మొదలైంది. కీలకమైన నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐదు ప్రాంతాల్లో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ ఐదురాష్ట్రాల ఎన్నికల్లో అస్సాంలో మాత్రమే కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి పోటీ పడుతున్నాయి. బెంగాల్ లో బీజేపీ టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ కూటములు.. తమిళనాడులో త్రిముఖ పోటీ ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం , పుదుచ్చేరిలలో రాజకీయ సందడి పతాక స్థాయికి చేరింది. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రభుత్వాల మార్పుకే పరిమితం కాకుండా, కేంద్ర రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురానున్నాయి.ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఏ మేరకు పాగా వేస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.పశ్చిమ బెంగాల్ పోరు మళ్ళీ దీదీ వర్సెస్ మోదీ గా మారింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తన పదేళ్ల సంక్షేమ పథకాలు ,బెంగాలీ అస్మితను నమ్ముకోగా, బీజేపీ అవినీతి , ప్రజల అసంతృప్తిని ప్రధాన అస్త్రాలుగా చేసుకుని బరిలోకి దిగుతోంది. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ మరింత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో, బెంగాల్ గడ్డపై హోరాహోరీ పోరు తప్పేలా లేదు. ఇక్కడ చిన్నపాటి ఓట్ల చీలిక కూడా ఫలితాలను తలకిందులు చేసే అవకాశం ఉంది.దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. అధికార డీఎంకే కూటమి పటిష్టంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, సూపర్ స్టార్ విజయ్ రాజకీయ ప్రవేశం తమిళగ వెట్రి కజగం రూపంలో కొత్త సవాలును విసిరింది. అన్నాడీఎంకే తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా, విజయ్ రాకతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది. విజయ్ వైపు మళ్లుతున్న యువత ఓట్లు ఎవరి గెలుపును అడ్డుకుంటాయో అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పుదుచ్చేరిలో కూడా ఇదే విధమైన కూటముల పోరు సాగుతోంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ ఉన్నాయి.సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని చెరిపివేశారు. ఎల్.డి.ఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. బిజెపి ఇక్కడ బలమైన మూడో శక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. త్రిముఖ పోటీ జరిగే కొన్ని నియోజకవర్గాల్లో బిజెపి ఓట్లు ఎవరిని ముంచుతాయో అన్నది కీలకం.అస్సాంలో ప్రధాన పోటీ బిజెపి , కాంగ్రెస్ మధ్యే ఉంది. ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ సారథ్యంలో బిజెపి ధీమాగా ఉంది. మహాజోత్ కూటమి విచ్ఛిన్నం కావడం బిజెపికి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ తన వ్యక్తిగత చరిష్మాతో బిజెపికి గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, అభివృద్ధి మంత్రం , హిందూత్వ కార్డుతో బిజెపి పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి.ప్రతి రాష్ట్రంలోనూ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు అటు అధికార పక్షానికి, ఇటు విపక్ష కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల తీర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో ప్రాంతీయ పార్టీల పట్టు నిలుస్తుందా? లేదా జాతీయ పార్టీలు తమ ప్రభావం చూపిస్తాయా? అన్నది మే నెలలో తేలనుంది.తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం , పుదుచ్చేరి శాసనసభల పదవీకాలం మే, జూన్ నెలల్లో ముగియనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈసీ ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది.అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికల వివరాలు:పశ్చిమ బెంగాల్‌లో వరుసగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీకి ఈసారి వ్యతిరేక పవనాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ బలమైన ప్రతిపక్షంగా అవతరించడం, క్షేత్రస్థాయిలో సంస్థాగత మార్పులు మమతా బెనర్జీకి పెద్ద సవాలుగా మారాయి. అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలు మరియు శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు దీదీకి మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి. ప్రజలు మార్పును కోరుకుంటున్నారా? లేక సంక్షేమ పథకాలతో మమత మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారా? అన్నది వేచి చూడాలి.తమిళనాడులో డీఎంకే ప్రభుత్వంపై ప్రజల స్పందన మిశ్రమంగా కనిపిస్తోంది. ధరల పెరుగుదల, మౌలిక సదుపాయాల కొరత, మరియు కొన్ని ప్రజా వ్యతిరేక విధానాలు స్టాలిన్ సర్కార్‌కు ఇబ్బందిగా మారాయి. తమిళనాడు రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పులు, మిత్రపక్షాల ఒత్తిడి మరియు బీజేపీ వంటి జాతీయ పార్టీల విస్తరణ స్టాలిన్ ఓటు బ్యాంకుకు ఎంతవరకు గండి కొడుతుందనేది కీలకం. సంక్షేమ కార్యక్రమాలపై పెడుతున్న భారీ వ్యయం మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి.ఈ ఇద్దరు దిగ్గజ నాయకులు తమ పట్టును నిలబెట్టుకుంటారా లేక ఓటమిని మూటగట్టుకుంటారా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, ఓటర్ల నాడి వేరుగా ఉంటుంది. సంక్షేమ పథకాలపై నమ్మకమా? లేక పరిపాలనలో మార్పు కోరుకుంటున్నారా? అన్నది మే 4న వెల్లడి కానుంది.

## ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం చేస్తున్నడు

మేం అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని సగౌరవంగా గాంధీ భవన్ కు తరలిస్తాం

బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కానే కాదు

శాసనసభ ఆవరణలో గవర్నర్ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి మన తల్లికాదు

అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్టిస్తాం

విశారదన్ మహారాజ్ అరెస్ట్ అక్రమం.. వెంటనే విడుదల చేయాలి.



హైదరాబాద్ మార్చ్ 16 ;తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రను రూపుమాపే దుస్సాహసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పనే చరిత్రను చెరిపివేయడం అన్నారు. అది కుదరకపోతే చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తారని చెప్పారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా అదే పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో ఈరోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహంపై స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన ఆ విగ్రహం తెలంగాణ చరిత్రను అమానించేలా ఉందన్నారు. బతుకమ్మ లేకుండా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ ఆత్మకు ఎంతమాత్రం కూడా ప్రతిరూపం కాదని చెప్పారు. సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని అన్నారు. తమ మూలాలను మదిలో తలుస్తూ తెలంగాణ బిడ్డలంతా కూడా ఉద్యమ సందర్భంలో తెలంగాణ తల్లికి అపురూపంగా ఇచ్చిన రూపమే బతుకమ్మతో కూడిన తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రాష్ట్రోద్యమ కాలంలో ఏర్పరచుకున్న తల్లి రూపురేఖలు మార్చడం, ఉద్యమ గుర్తులను చెరిపేయటమంటే అది మూర్ఖపు పనేనని ఆమె అన్నారు. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపుతున్నానని భ్రమిస్తూ రేవంత్ రెడ్డి అల్ప సంతోషంలో ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక... అమరుల త్యాగాలను ఒడిసి పట్టుకున్న నాటి ఉద్యమ తెలంగాణ తల్లిని అదే చోట ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సగౌరవంగా కాంగ్రెస్ కు ఆఫీస్ కు తరలిస్తామని తేల్చిచెప్పారు.

**విశారదన్ మహారాజ్ అరెస్ట్ అక్రమం**

ఖమ్మం వెలుగుమట్ల బాధితులకు అండగా నిలిచేందుకు వెళ్లిన ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ను పోలీసులు అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖండించారు. ఈ అరెస్ట్ అక్రమమని అన్నారు. అరెస్ట్ చేసిన విశారదన్ మహారాజ్ ను పలు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బంది పెట్టటం దారుణమన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణకే గర్వకారణం**

ప్రముఖ కవి, అధ్యాపకులు నందిని సిధారెడ్డి గారికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ఎంతో సంతోషానిచ్చిందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేసిన ఆయనకు ఈ అవార్డు రావటం తెలంగాణకే గర్వకారణమని చెప్పారు. వచన కవిత్వ విభాగంలో నందిని సిధారెడ్డి గారు రచించిన "అనిమేష" కవితా సంపుటికి పురస్కారం లభించడం అభినందనీయమన్నారు. ఆయన కలం నుంచి మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు.

## నికార్సైన హిందువులు మొదటి నుంచి కూడా దళిత సమాజమే

### కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రవర్తిస్తున్న తీరు హేయనీయం

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్




హైదరాబాద్ మార్చ్16నికార్సైన హిందువులు, నిజంగా ధర్మాన్ని పాటించే వారు ఎవరు అంటే, మొదటి నుంచి కూడా దళిత సమాజమే ముందుంటుందని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వారి కుటుంబ సంప్రదాయాలు, పూజా విధానాలు, గ్రామీణ సంస్కృతి పల్లెల్లో పోచమ్మ, మైసమ్మ నుంచి మొదలుకొని ప్రతి ఆరాధనలో దళితుల పాత్ర ఎంతో గౌరవనీయంగా ఉంటుంది. బ్రాహ్మణులను గౌరవించడం గానీ, సమాజంలోని ఇతర వర్గాలను గౌరవించడం గానీ.. సమాజంతో కలిసిమెలిసి జీవించే స్వభావం దళితులదేనన్నారు. అలాంటి దళిత సమాజంలో పుట్టిన వ్యక్తిగా చెప్పుకుంటూ, ఈరోజు కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రవర్తిస్తున్న తీరు పూర్తిగా అసహజంగా కనిపిస్తోంది. మంత్రి పదవి రాలేదనే అసంతృప్తి, ముఖ్యంగా అడ్లూరి లక్ష్మణ్ గారికి మంత్రి పదవి రావడంతో సామేల్ కునన అసంతృప్తి కారణంగా, ప్రభుత్వం పట్ల, హిందూ సమాజం పట్ల, కాంగ్రెస్ వేదికలనే ఉపయోగించుకొని అసహనం వ్యక్తం చేస్తున్నట్టుగా అనిపిస్తోందన్నారు. మాదిగ సమాజానికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో కొందరు ఎమ్మెల్యేలు కలిసి డిమాండ్ చేసిన విషయం వాస్తవమే. అయితే పార్టీ ప్రాధాన్యతల ప్రకారం లక్ష్మణ్ కుమార్ మంత్రి పదవి ఇచ్చిన తర్వాత నుంచి సామేల్ గారి వ్యవహార శైలి గమనిస్తే, అది ఒక రాజకీయ నాయకుడి సమతుల్యత కంటే వ్యక్తిగత అసంతృప్తి ఆధారంగా నడుస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రతి సందర్భంలో హిందూ సమాజం పట్ల, వేదికపై ఉన్న నాయకుల పట్ల నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం ఆయన అలవాటుగా మారింది. ఇటీవల కబ్బంపల్లి సత్యనారాయణ గారి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కూడా మరో దళిత నాయకుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంలో అవసరం లేని వ్యాఖ్యలు చేయడం సమాజం మొత్తం గమనించిందని తెలిపారు. ఆయన వ్యాఖ్యలపై సమాజంలో తీవ్ర అసంతృప్తి ఉంది. తన నియోజకవర్గ ప్రజలే భవిష్యత్తులో సరైన బుద్ధి చెబుతారని అక్కడి ప్రజల్లో చర్చ జరుగుతోంది. అదే ప్రాంతం నుంచి వచ్చిన కొందరు నాయకులు కూడా ఇలాంటి అసహనంతో మాట్లాడటం దురదృష్టకరం. ఒకరికి ఎమ్మెల్యే టికెట్ రాలేదని, ఇంకొకరికి మంత్రి పదవి రాలేదని, ఆ అసంతృప్తిని బిజెపి మీద గానీ, హిందుత్వం మీద గానీ, బ్రాహ్మణ సమాజం మీద గానీ చూపించడం సరైంది కాదన్నారు.కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన దళిత ఎమ్మెల్యేలు ముందు తమ సమాజానికి ఇచ్చిన హామీల గురించి మాట్లాడాలి. రాష్ట్రవ్యాప్తంగా దళితుల కోసం తీసుకున్న దరఖాస్తులు, ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయం, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు.. ఇవన్నీ ఏ దశలో ఉన్నాయి? దరఖాస్తులు కలెక్టరేట్లలో పేరుకుపోయాయి కానీ లబ్ధిదారులకు సహాయం అందడం లేదు. బడ్జెట్‌లో దళితుల కోసం కేటాయించిన నిధులు ఎక్కడ వినియోగమవుతున్నాయి? ఎందుకు ఖర్చు కాకుండా సరెండర్ అవుతున్నాయి? రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఈ విషయాలపై దళిత ఎమ్మెల్యేలు మాట్లాడాలని కుమార్ డిమాండ్ చేసారు.దళిత సమాజం ముందుకు వెళ్లి, తమ హామీలు నెరవేర్చలేకపోయినందుకు క్షమాపణ చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలపై ఉంది. దళితుల అభివృద్ధి కోసం, వారికి ప్రకటించిన పథకాల కోసం ప్రభుత్వం దగ్గర పోరాడకుండా, దారి మళ్లించి ఇతర అంశాలపై మాట్లాడటం సమంజసం కాదు. ఏ సమాజం నుంచి గెలిచి వచ్చారో, ఆ సమాజం కోసం ముందుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. మీ నియోజకవర్గంలో ఎంతమందికి రుణాలు వచ్చాయి? ఎంతమంది దరఖాస్తుదారులకు సహాయం అందింది? ఈ లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేసారు. ఇంకొకరికి పదవి వస్తే అసహనం, ఇంకొకరికి మంత్రి పదవి వస్తే అసంతృప్తి --- ఈ వ్యక్తిగత అసంతృప్తిని సమాజంలో పెద్ద అంశంగా చూపించాలనుకోవడం రాజకీయ పరిపక్వత కాదు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత సమాజానికి ప్రభుత్వం ఏమి చేసిందో వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేసారు. అలాగే ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కనీసం షోకాజ్ నోటీసులు ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీలో బ్రాహ్మణులు లేరా? మంత్రులు లేరా? ప్రభుత్వం లోపలే అనేక విభేదాలు, వాటాలపై గొడవలు జరుగుతున్న దృశ్యాలు ప్రజలందరూ చూశారు. అలాంటి పరిస్థితిలో సమాజానికి ఏమి చేస్తారు? ఇచ్చిన 420 హామీల్లో నాలుగు కూడా సక్రమంగా అమలు కాలేదనే భావన ప్రజల్లో ఉందమన్నారు. సామేల్ లాంటి వారు నిజంగా దళిత సమాజం నుంచి వచ్చామని భావిస్తే, ముందుగా తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ఆశీర్వదించడానికి వచ్చిన వారిని విమర్శించడం కాదు; సమాజ ప్రయోజనాల కోసం మాట్లాడాలన్నారు.ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతికిరణ్ , బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాషా , మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు , బిజెపి ధార్మిక సెల్ కన్వీనర్ సూర్యప్రకాష్ తక్కితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.'

## మహానీ యుల ఆశయ సాదనే బీసీ జాగృతి సేన లక్ష్యం



నాగర్ కర్నూల్ మార్చ్ 16 ;నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం లోని బీసీ బాలుర కళాశాల హాస్టల్ లో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ ఆద్వర్యం లో పూలె, అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ మహా నీయుల జయంతి మాసం లో భాగంగా నేడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం లో పూలె, అంబేద్కర్ జయంతిని నిర్వహించామని తెలిపారు. అణగారిన ప్రజల బ్రతుకు ల్లో అక్షర జ్యోతి వెలిగించిన పూలె జీవితాన్ని ఆదర్శంగా తీసుకున్న భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఉన్నత చదువు లు చదివిన తర్వాత గొప్పగా జీవించే అవకాశం ఉన్నా షెడ్యూల్ కులాల ప్రజల తో పాటు దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారాస్వేచ్ఛ, సమానత్వం, హక్కులు కల్పించారని అన్నారు,రెండవ మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ కృషి ఫలితం గా నే బీసీలకు ప్రభుత్వ ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్ లు అమలు అయ్యాయని,, ముగ్గురు మహనీయుల ఆశయ సాధన కై నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీసీ జాగృతి సేన రాష్ట్ర కార్యదర్శి రఘు నందన్ చారి.ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాళ్ళ నిరంజన్, విద్యార్థి సంఘము జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మౌలానా,అభిషేక్, శివకుమార్, శ్రీకాంత్, శ్రీను, చరణ్, శివ, జస్వంత్, అంజి, వంశీ, అజయ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటుకు వినతి పత్రం అందజేత... టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బావాండ్ల వెంకటేష్...



నాగర్ కర్నూల్ జిల్లా ప్రజాబలం ప్రతినిధినాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గర గల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం (ఐ.డి.ఓ.సి) ముందు అన్ని రకాల బస్సులు ఆపాలని నాగర్ కర్నూలు ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్యకు సోమవారం నాడు తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు భావాండ్ల వెంకటేష్, జిల్లా కార్యదర్శి షర్ఫుద్దీన్ వినతీ పత్రమును అందజేశారు.

ప్రతిరోజు 500 మంది ఉద్యోగస్తులు వివిధ ప్రాంతాలలోని ఇంటివద్ద నుండి వ్యక్తిగత వాహనాలు లేక ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణకు చేరుకుంటారని, అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయలలో వారి పనుల నిమిత్తం 1500 మంది ప్రజలు, మహిళలు వస్తూ ఉంటారని,కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రజా సౌకర్యార్థం రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో టిఎన్జీవో యూనియన్ జిల్లా కోశాధికారి బాలరాజు, నాయకులు సురేష్, చెన్నకేశవులు,రహీంఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.ఖ

## సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్.. మస్జిద్ ఏ ఖుబా పాండంగాపురం ఇఫ్తార్లోపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్







ఖమ్మం ప్రతినిధి మార్చి 16 (ప్రజాబలం) ఖమ్మం సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులని రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ సిఐ ఉస్మాన్ షరీఫ్ అన్నారు సోమవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనీ పాండురంగాపురం రెండవ డివిజన్లో గల మస్జీద్ ఏ ఖుబా లో పాల్గొని ఆయన మాట్లాడారు... క్రమశిక్షణకు, సహనంకు రంజాన్ మాసం ఎంతో పవిత్రతతో కూడుకున్నదని ఐదు పూటల నమాజ్ తో పాటు రంజాన్ ప్రత్యేక తరావీహ్ నమాజు ప్రతి ఒక్కరు ఆచరిస్తూ అల్లాహ్ ను వేడుకుంటూ.. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో మనమందరం నడుచుకుందామని ఆయన అన్నారు. ఇఫ్తార్ విందు అనంతరం నమాజు చేసుకొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.. ఈకార్యక్రమంలో మస్జిద్ ఏ ఖుబా సదర్ (ప్రెసిడెంట్ ) ఫయాజ్, పూర్వ సదర్ అఫ్జల్మియా, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి సలీం, మస్జిద్ మతపెద్ద గులాం రబ్బాని, ఖమ్మం జిల్లా ఏఐటీయూసీ నాయకులు షేక్ ఇబ్రహీం, టైలర్ హుస్సేన్ భాయ్, ఇంటెలిజెన్స్ ఎస్ ఐ షేక్ రహీం కరాటే ఖాసీం జర్నలిస్ట్ జానిపాషా షేక్ రజిమ్ పోలీస్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పేదల సొంతింటి కల సాకారం కావాలి ఇందిరమ్మ ఇండ్ల సమీక్షలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



ప్రజాబలం ప్రతినిధి వేములవాడ మార్చి -16 వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ గృహాల పురోగతిపై సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన త్వరితగతన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడికి ?ఒక గూడు అనేది వారి కుటుంబానికి ఇచ్చే అతిపెద్ద సామాజిక భరోసా అని, ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నిధులు సకాలంలో అందేలా చూడాలని, నిర్మాణ దశల్లో వారికి అవసరమైన సాంకేతిక సలహాలు అందిస్తూ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చూడటమే మన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సంపత్ కుమార్ మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.



## మల్లన్న సాగర్ నుండి ఆలేరు నియోజకవర్గానికి సాగునీరు విడుదల చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి మార్చి 16 ఆలేరు నియోజకవర్గం రైతాంగ ప్రయోజనాలే ధ్యేయంగా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుండి సాగునీటిని విడుదల చేశారు నియోజకవర్గంలోని చెరువులు కుంటలను నింపే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్య తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ స్వయంగా మల్లన్న సాగర్ ను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి గేట్లను ఎత్తారు ఆలేరు నియోజకవర్గంలో పాటు తుంగతుర్తి నియోజకవర్గం ఉన్న ఎండిపోయిన చెరువులను నింపడమే లక్ష్యంగా ఈ నీటిని విడుదల చేయడం జరిగింది నీటి విడుదల సందర్భంగా జల దేవతలకు ఇరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గాల సుభిక్షం గా ఉండాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆలేరు నియోజకవర్గం పాటు తుంగతుర్తి నియోజకవర్గానికి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వం లక్ష్యం ఎండాకాలంలో రైతాంగం ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో మల్లన్న సాగర్ నుండి చెరువులను నింపే కార్యక్రమాన్ని చేపట్టాం గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పెండింగ్లో ఉన్న పనులను



పూర్తిచేసి ఆలేరు నియోజవర్గానికి సాగునీరు అందించి అధిక దిగుబడి పండించే దిశగా అభివృద్ధి చేస్తామని ఈ నీటి విడుదలతో ఇరు నియోజకవర్గాలోని భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలని రెండు నియోజకవర్గాల రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాను అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నీటిపారుదల శాఖ అధికారులు నియోజకవర్గం రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



## వైరా మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ ను ఘనంగా సన్మానించిన ఎంపీ రేణుకా చౌదరి



ఖమ్మం ప్రతినిధి మార్చి 16 (ప్రజాబలం) ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన కట్ల సంతోష్ ను రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కట్ల సంతోష్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి మాట్లాడుతూ ప్రజలు మీ మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని ప్రజల కోసం నిరంతరం సేవ చేసి ప్రజల మన్నలను పొందాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీ కౌన్సిలర్లు అభిమానులు బంధువులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్.. మస్జిద్ ఏ ఖుబా పాండంగాపురం ఇఫ్తార్లో రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్







ఖమ్మం ప్రతినిధి మార్చి 16 (ప్రజాబలం) సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ విందులని రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ సిఐ ఉస్మాన్ షరీఫ్ అన్నారు.. సోమవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనీ పాండురంగాపురం రెండవ డివిజన్లో గల మస్జీద్ ఏ ఖుబా లో పాల్గొని ఆయన మాట్లాడారు క్రమశిక్షణకు, సహనంకు రంజాన్ మాసం ఎంతో పవిత్రతతో కూడుకున్నదని, ఐదు పూటల నమాజ్ తో పాటు రంజాన్ ప్రత్యేక తరావీహ్ నమాజు ప్రతి ఒక్కరు ఆచరిస్తూ అల్లాహ్ ను వేడుకుంటూ.. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో మనమందరం నడుచుకుందామని ఆయన అన్నారు. ఇఫ్తార్ విందు అనంతరం నమాజు చేసుకొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.. ఈకార్యక్రమంలో మస్జిద్ ఏ ఖుబా సదర్ (ప్రెసిడెంట్ ) ఫయాజ్, పూర్వ సదర్ అఫ్జల్మియా, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి సలీం, మస్జిద్ మతపెద్ద గులాం రబ్బాని, ఖమ్మం జిల్లా ఏఐటీయూసీ నాయకులు షేక్ ఇబ్రహీం, టైలర్ హుస్సేన్ భాయ్, ఇంటెలిజెన్స్ ఎస్ ఐ షేక్ రహీం, కరాటే ఖాసీం, జర్నలిస్ట్ జానిపాషా, షేక్ రజిమ్, పోలీస్ చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ సొంత రాజకీయాలు...



విజయవాడ, మార్చి 16, వైసీపీ అధినేత జగన్ కోటరీని పక్కన పెట్టాలని ఆ పార్టీలో .. పై స్థాయి నేతల నుంచి కింది స్థాయి క్యాడర్ వరకూ కోరుకుంటున్నారు. జగన్ నేరుగా అందరితో టచ్ లో ఉండకపోవచ్చు కానీ అసలు మొత్తం ఆయన తరపున కోటరీలోకీలక వ్యక్తులుగా చెలామణి అవుతున్న నేతలే చక్కబెడుతున్నారు. జగన్ కు తెలుస్తుందో లేదో కూడా క్యాడర్ కు తెలియడం లేదు. అయితే రెండు రోజుల కిందట జరిగిన ఆవిర్భావ దినోత్సవం రోజున కొద్ది సేపే అయినా స్క్రిప్ట్ లేకుండా ప్రసంగించడం, ఆ కార్యక్రమంలో ఆయన పక్కన కోటరీ నేతలెవరూ లేకపోవడం పార్టీ క్యాడర్ లో ఆశలు నింపుతోంది. వైసీపీ ఆవిర్భావ దినోత్సవం వేదికగా జగన్ తీరులో కనిపిస్తున్న మార్పు ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్ అయ్యింది. సాధారణంగా జగన్ అంటేనే చుట్టూ ఒక ప్రత్యేక కోటరీ ఉంటుంది. ఆ కోటరీని దాటుకుని సామాన్య కార్యకర్త వెళ్లడం అసాధ్యమనే ముద్ర పడిపోయింది. గత ఐదేళ్లుగా జగన్ తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఆ ముగ్గురు నలుగురు కీలక నేతల పాత్రే ఎక్కువగా ఉందనే అసహనం పార్టీలో ఉంది. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు జగన్ దృష్టికి వెళ్లకుండా ఈ కోటరీ అడ్డుపడుతోందని సీనియర్ నేతలు సైతం లోలోపల మదనపడుతున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఈ అసంతృప్తి మరింత పెరిగింది. కోటరీకి ఉన్న అతి సాన్నిహిత్యం వల్ల పార్టీ నేతల మధ్య దూరం పెరిగిందని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది. ఇప్పుడు జగన్ ఈ వర్గాన్ని పక్కన పెడుతున్నట్లు కనిపిస్తుండటం కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. సాధారణంగా జగన్ ప్రసంగాలు పక్కాగా రాసి పెట్టుకున్న కాగితాల చుట్టూ సాగుతుంటాయి. కానీ ఆవిర్భావ దినోత్సవం నాడు ఆయన ఏ కాగితం చూడకుండా మనసులో ఉన్నది మాట్లాడారు. ఇది నాయకత్వ శైలిలో మార్పును సూచిస్తోంది. నేరుగా ప్రజలతో కార్యకర్తలతో కనెక్ట్ అవ్వాలంటే మధ్యలో సలహాదారులు ఉండకూడదని జగన్ గుర్తించినట్లు కనిపిస్తోంది. కోటరీ చెప్పే లెక్కల కంటే కార్యకర్తల ఆవేదన వింటేనే పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆయన భావిస్తున్నట్లు ఈ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది. కేవలం ఒక రోజు వేడుకతోనే ఈ మార్పు ఆగిపోతే ఫలితం ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు. సలహాదారులు ఇచ్చే సమాచారంపైనే ఆధారపడకుండా జిల్లాల వారీగా ముఖ్య నేతలు కింది స్థాయి కార్యకర్తలతో జగన్ నేరుగా టచ్ లో ఉండాలి. లోటస్ పాండ్ లో లేదా తాడేపల్లిలో గదుల మధ్య జరిగే సమీక్షల కంటే క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలని క్యాడర్ ఆశిస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరిచారని కోటరీని దూరంగా పెట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నాయకుడి చుట్టూ ఉండే వ్యక్తుల కంటే జెండా మోసే కార్యకర్తలే శ్రీరామరక్ష అని జగన్ కి ఆలస్యంగానైనా అర్థమైందన్న భావన వ్యక్తమవుతోంది. జగన్ తనంతట తానుగా బయటకు వచ్చి ప్రజలతో మమేకమైతే అటు ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలోనూ ఇటు పార్టీని బలోపేతం చేయడంలోనూ వేగం పెరుగుతుందని అనుకోవచ్చు. మరి ఇదే పద్ధతిని ఆయన భవిష్యత్తులో కూడా కొనసాగిస్తారా లేక మళ్లీ పాత సలహాదారుల మాయలో పడతారా అన్నది వేచి చూడాలి.

# జనసేన వర్సెస్ టీడీపీ



కాకినాడ, మార్చి 16, పిఠాపురం నియోజకవర్గ శాశ్వత ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ఉంటారని, ఆయన చేస్తున్న అభివృద్ధే అందుకు నిదర్శనమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో ఇప్పటికే 60,000 మందితో జనసేన ఒక బలమైన కుటుంబంగా మారిందని, త్వరలోనే లక్ష సభ్యత్వాల మార్కును చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం రాష్ట్ర స్థాయి నేత మాత్రమే కాదు, దేశ స్థాయి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కూడా పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడుతూ, ఎంపీ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు.జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురంలో పార్టీ శ్రేణులు పండుగ వాతావరణాన్ని తలపించేలా వేడుకలు నిర్వహించాయి. ఉప్పాడ బస్టాండ్ వద్ద భారీ కేక్ కట్ చేసిన అనంతరం, పిఠాపురం నుండి గొల్లప్రోలు వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గొల్లప్రోలులో అట్టహాసంగా జెండా ఆవిష్కరణ జరిగింది. రాజకీయ వేడుకలతో పాటు సేవా నిరతిని చాటుకుంటూ, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్ సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.అయితే, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వ్యాఖ్యల వెనుక పిఠాపురం నియోజకవర్గంలో సాగుతున్న అంతర్గత రాజకీయ పోరు కారణమనే చర్చ నడుస్తోంది. ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంపై టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అధికారులపై, జనసేన నేతలపై మండిపడ్డారు. ముఖ్యమంత్రికి ప్రాధాన్యత లేని చోట టీడీపీ కార్యకర్తలకు స్థానం ఎక్కడిదని ఆయన ప్రశ్నిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కూటమి నాయకులు రాష్ట్ర స్థాయిలో కలిసి ఉన్నప్పటికీ, పిఠాపురంలో మాత్రం టీడీపీ, జనసేన నేతల మధ్య 'కోల్డ్ వార్' నడుస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్మ అసహనానికి కౌంటర్ గానే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ "శాశ్వత ఎమ్మెల్యే" వ్యాఖ్యలు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పిఠాపురంలో శుక్రవారం జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చాలా చిన్నదిగా ఉండటంపై మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా మండిపడ్డారు. అధికారులే కూటమి పార్టీల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ఇది కేవలం తనను మాత్రమే కాకుండా, మూడు పార్టీల నాయకులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పిలిచి అవమానించడం తగదని సూచిస్తూ, అధికారుల తీరుకు నిరసనగా ఆయన సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయారు. వర్మకు మద్దతుగా టీడీపీ కార్యకర్తలు కూడా అధికారుల వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేశారు.పిఠాపురంలో వర్మ బలమైన నాయకుడు. గతంలో ఓసారి పార్టీ టికెట్ రాకపోతే ఆయన ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచారు. పిఠాపురం నియోజకవర్గాన్ని బలమైన నియోజకవర్గంగా మార్చారు వర్మ. అయితే రాష్ట్ర స్థాయిలో పవన్ కళ్యాణ్ తో టిడిపికి పొత్తు అవసరం. గత అనుభవాల దృష్ట్యా పవన్ కళ్యాణ్ కు ఒక నియోజకవర్గం అవసరం వచ్చింది. అంతకుముందు ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోవడంతో 2024లో జాగ్రత్త పడ్డారు. అలా పిఠాపురం పై దృష్టి పడడంతో వర్మను సైడ్ చేయాల్సి వచ్చింది. బలమైన నాయకుడు కావడంతో ఆయన సాయం తీసుకోవాలని భావించి ప్రాధాన్యమిచ్చారు వర్మకు.. అయితే బలమైన హామీతోనే అప్పట్లో వర్మ పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం ఉంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో రోజురోజుకు వర్మలో అసహనం పెరుగుతోంది. టిడిపి నాయకత్వం సైతం వర్మ విషయంలో నిస్సహాయతతో ఉంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పిఠాపురం నియోజకవర్గం లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. వర్మ కు ఎటువంటి నామినేటెడ్ పదవి దక్కలేదు. ఆపై పిఠాపురం నియోజకవర్గంలో అధికార పార్టీగా సరైన గౌరవం దక్కడం లేదు. ఈ తరుణంలో పిఠాపురంలో జనసేన వర్సెస్ టిడిపి అన్నట్టు పరిస్థితి మారింది. రాష్ట్రస్థాయిలో పొత్తు ఉండడం.. పవన్ కీలకంగా ఉండడం.. ఆయనకు కాదని వర్మకు పదవి ఇచ్చే అవకాశం లేకపోవడంతో రోజురోజుకు పరిస్థితి శృతిమించుతోంది. అయితే పిఠాపురంలో తనకే కాదు చంద్రబాబుకు కూడా విలువ లేదని చెప్పేందుకే వర్మ అలా చేసి ఉంటారన్న టాక్ కూడా పొలిటికల్ వర్గాల్లో ఉంది. ఇప్పటికే పిఠాపురం అనేసరికి రకరకాల వివాదం నడుస్తూనే ఉంటుంది. ఒకానొక దశలో వర్మ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోతారని కూడా ప్రచారం నడిచింది. పార్టీ కోసం కష్టపడిన తాను ఎందుకు గుడ్ బై చెబుతానని వర్మ ప్రశ్నించారు కూడా. అయితే తన ఆవేదనంత పార్టీ కోసమే అన్నట్టు ఇప్పుడు వర్మ ప్రవర్తన ఉంది. దీనిపై టిడిపి నాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## ఎంపి పుట్టా వ్యవహారం పై సీఎం చంద్రబాబు ఆగ్రహం

విజయవాడ టీడీపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ వ్యవహారంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు.. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు.. ఘటనపై వివరణ కోరుతూ మహేష్ కు నోటీసులు ఇవ్వాలని,పూర్తి నివేదిక తనకు సమర్పించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కు సూచించారు. డ్రగ్స్ కేసుల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

నేతల బలహీనతలు,తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని తేల్చిచెప్పారు..

# కొబ్బరికి యుద్ధ కష్టాలు

కాకినాడ, మార్చి 16, కొబ్బరి అనగానే కేరళ తరువాత కోనసీమ గుర్తుకు వస్తుంది. కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి ఎగుమతులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్‌కే కాక ఇతర దేశాలకు ఎగుమతులు అవుతుంటాయి. అయితే మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రభావం ఈ కొబ్బరి మార్కెట్ పైన కూడా పడిందంటున్నారు కొబ్బరి వ్యాపారులు. ఈ పరిస్థితి ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాతోపాటు తమిళనాడు, కేరళ మార్కెట్లపై తీవ్ర ప్రభావం ఉంటుందంటున్నారు. కొబ్బరి సాగుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక పెట్టింది పేరు. గతంలో దేశీయ మార్కెట్‌లోనే కొబ్బరి ఎగుమతులు ఉండగా కొన్నేళ్లుగా మన దేశీయ కొబ్బరికి మిడిల్ ఈస్ట్ దేశాల్లో బాగా డిమాండ్ పెరిగింది. ముఖ్యమంగా ఏపీ, తమిళనాడు ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయంటున్నారు. రంజాన్ మాసం కావడంతో కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కవుగా వాడుతున్నారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీకి కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా ఆ దేశాలకు ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు.ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణంతో గుబులు పుట్టిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబందించిన కొబ్బరి వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. గత నెలలో శివరాత్రి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వెయ్యి పచ్చి కాయలు రూ.18-20 వేలు పలికాయని రైతులు వెల్లడించారు. కురిడీల ధరలూ బాగానే ఉండగా శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా మంచి ధర వస్తుందని వ్యాపారులు ఆశించారు. ఓడరేవుల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లే కొబ్బరికాయలు అక్కడే నిలిచిపోవడంతో ధరలపై ప్రభావం చూపిందంటున్నారు.దీంతో ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.13-14 వేలకు పతనమయ్యాయని వ్యాపారులు రైతులు అంటున్నారు. ఏపీలో కొబ్బరికి ప్రసిద్ధి చెందిన కోనసీమ జిల్లా అంబాజీపేటలో కొబ్బరికి పెట్టింది పేరు. అలాంటి ప్రాంతం నుంచి రోజు ఇతర రాష్ట్రాలకు పదుల సంఖ్యలో లారీలు ఎగుమతి అయ్యేవి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎగుమతులు పూర్తిగా పడిపోయి కొబ్బరి పచ్చికాయ కురిడికాయ ధరలు అమాంతంగా పడిపోవడంతో అటు వ్యాపారులు ఇటు రైతులు ఆవేదన చెందుతున్నారు.

# ఉత్థానం ప్రజలకు భారీ ఊరట

శ్రీకాకుళం, మార్చి 16, చాలా ఏళ్లుగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజలకు ఒక గొప్ప శుభవార్త అందింది. పలాసలో ఉన్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ , సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తొలిసారిగా ఒక కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చాలా విజయవంతంగా జరిగింది.

ఈ ఆపరేషన్ ద్వారా సోంపేటకు చెందిన ఒక యువతికి కొత్త జీవితం దొరికింది. ఒక మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీ కూడా లేని చోట ఇలాంటి పెద్ద ఆపరేషన్ జరగడం ఆ ప్రాంత ప్రజలకు భారీ ఊరటగానే చెప్పవచ్చు. సోంపేటకు చెందిన సీహెచ్ హేమ శ్రీ అనే యువతి గత కొంత కాలంగా రెండు కిడ్నీలు పాడైపోయి చాలా ఇబ్బందులు పడుతోంది. ఆమె పరిస్థితి చూసి చలించిపోయిన తండ్రి మోహన్ రావు తన కిడ్నీని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మొదలైన ఆపరేషన్ సుమారు మధ్యాహ్నం 3 గంటల వరకు అంటే నాలుగు నుంచి ఐదు గంటల పాటు సాగింది.. డాక్టర్లు చాలా కష్టపడి ఈ ఆపరేషన్ విజయవంతం చేశారు. ప్రస్తుతం హేమశ్రీ కిడ్నీ బాగానే పని చేస్తోందని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. అయితే ఆపరేషన్ తర్వాత ఇచ్చే జాగ్రత్తల్లో భాగంగా మరో 15 రోజుల పాటు ఆమెకు వైద్యసేవలు అందిస్తామని డాక్టర్లు తెలిపారు. ఈ ఆపరేషన్ వెనుక ఒక పెద్ద డాక్టర్ల టీమ్ కృషి ఉంది. కేజీహెచ్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు ఈ టీమ్‌కు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలాస వంటి చిన్న ప్రాంతంలో ఇలాంటి ఆపరేషన్ చేయడం ఇదే మొదటిసారి అని గర్వంగా చెప్పారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి చెందిన సీనియర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు కూడా ఈ టీమ్‌లో కీలక పాత్ర పోషించారు. వీరితోపాటు డాక్టర్లు పూర్ణచంద్ర, వివేకానంద, అశోక్‌వర్ధన్, జోగినాయుడు, స్థానిక వైద్యులు రాకేష్, జ్యోత్స్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ జే కిశోర్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అనేవి ఒక పెద్ద సమస్యగా ఉన్నాయి. గతంలో ఇలాంటి ఆపరేషన్లు కావాలంటే విశాఖ, కర్నూలు, గుంటూరు వెళ్లాల్సి వచ్చేది.

పలాసలో ఈ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ రావడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ?లు జరుగుతోంది. మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ఇలాంటి సదుపాయాలు ఉండటం గొప్ప విషయమని డాక్టర్ ఉమామహేశ్వరరావు కొనియాడారు.

ఈ ఆసుపత్రి నిర్మాణం అభివృద్ధిపై నాయకులు స్పందించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఆసుపత్రి నిర్మిస్తే నేడు కూటమి ప్రభుత్వంలో కిడ్నీ మార్పిడి చికిత్సకు చర్యలు చేపట్టినట్టు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దాతల సహాయంతో పది కొత్త డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేశామని వైద్య పరికరాల కోసం 9 కోట్లు రూపాయలు, పరిశోధనల కోసం 3 కోట్ల రూపాయలు కేటాయించినట్టు వెల్లడించారు.

# ఏపీ బీజేపీకి ఏమైంది...

విజయవాడ, మార్చి 16, జాతీయస్థాయిలో భారతీయ జనతా పార్టీ దూకుడుగా ఉంది. చాలా దూకుడుగా ముందుకు వెళ్తోంది. కానీ ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది పరిస్థితి. పివిఎన్ మాధవ్ పగ్గాలు తీసుకున్నాక పరిస్థితుల్లో మార్పు ఉంటుందని అంతా భావించారు. ఆయన కూడా బాధ్యతలు తీసుకున్నాక చాలా వేగంగా పావులు కదిపారు. కానీ ఎందుకో ఇటీవల ఫుల్ సైలెన్స్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలు కూడా తగ్గాయి. ముఖ్యంగా పార్టీలో కార్యవర్గ విభాగాల ఏర్పాటు కూడా జరగలేదు. పక్కనే ఉన్న తెలంగాణలో కొత్త కార్యవర్గాలను ప్రకటించారు. కొత్త కొత్త నేతలకు ఛాన్స్ ఇచ్చారు. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏమో కూటమిలో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు ఉంది వారి పరిస్థితి.మొన్నటి ఎన్నికల్లో ఓట్లతో పాటు సీట్లను పెంచుకుంది భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీ తరపున ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలిచారు. ముగ్గురు లోక్సభ సభ్యులు అయ్యారు. కేంద్రమంత్రిగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ఉన్నారు. రాష్ట్ర మంత్రిగా సత్య కుమార్ యాదవ్ ఉన్నారు. మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఎమ్మెల్సీ అయ్యారు. ఎంపీలుగా పురందేశ్వరి, సీఎం రమేష్.. ఎమ్మెల్యేలుగా విష్ణుకుమార్ రాజు, సుజనా చౌదరి వంటి సీనియర్లు కొనసాగుతున్నారు. అయినా సరే పార్టీకి ఒక ఊపు తేలేకపోతున్నారు. దీనికి ఏం కారణం అనేది ఇప్పుడు ఒక ప్రశ్న. పొత్తుతో ముందుకు వెళ్తున్నారు సరే. కానీ పార్టీ కార్యక్రమాల విషయంలో సైతం వెనుకబాటు కనిపిస్తోంది. ఇది పార్టీ శ్రేణులకు అంతుపట్టడం లేదు. పార్టీ బలోపేతం అనేది భవిష్యత్తు కలగానే మిగిలిపోతోంది.భారతీయ జనతా పార్టీ ఇప్పటిది కాదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించే సమయానికి ఏపీలో ఎంటర్ అయింది ఆ పార్టీ. ఉమ్మడి ఏపీలో విశాఖ మహానగరంలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్ పదవిని సొంతం చేసుకుంది బిజెపి. అటు తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. అంతకంటే ముందే విజయాన్ని దక్కించుకున్న బీజేపీ మాత్రం వెనుకబడిపోయింది. తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉంటే పదుల సంఖ్యలో సీట్లు దక్కించుకుంటోంది. లేకుంటే ఉనికి చాటుకోవడానికి కూడా ఇబ్బంది పడుతోంది. ఈ పరిస్థితి దశాబ్దాలుగా మారడం లేదు. నాయకత్వాలు మారినా సరైన ఫలితం దక్కడం లేదు బిజెపికి. యావత్తు భారతదేశాన్ని ఆవహిస్తున్న బిజెపి.. ఏపీలో ఎందుకు వెనుకబడిపోతుంది అనేది ఇప్పటికీ ధర్మసందేహమే.

# జాబ్ క్యాలెండర్ రెడీ...

విజయవాడ మార్చి 16, ఏపీ ప్రభుత్వం దూకుడు మీద ఉంది. దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటోంది. నిన్ననే రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసింది. ఇప్పుడు ఉగాదికి మరో ప్రకటన రానుంది. జాబ్ క్యాలెండర్ ను ప్రకటించనుంది. అందుకు సంబంధించి తుది కసరత్తు జరుగుతోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు పోస్టుల వారీగా ప్రకటన చేయనున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖకు కూడా ప్రతిపాదనలు అందాయి. ప్రభుత్వం అధికారికంగానే జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. ఉపాధ్యాయ పోస్టులతో పాటు దాదాపు పదివేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు కూడా విడుదల చేయనుంది ఏపీ ప్రభుత్వం. ముందుగా ఉగాదికి ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను జాబ్ క్యాలెండర్ ల రూపంలో ప్రకటించనుంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన భర్తీ జరిగింది. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్ళ భర్తీ జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పెద్ద ఎత్తున నియామకాలు కూడా జరిగాయి. అయితే మిగతా ఖాళీల భర్తీకి సంబంధించి కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందుకే ఉగాది నాడు ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వివరిస్తూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. దాదాపు 60 ప్రభుత్వ విభాగాల్లో 10 వేల పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్ను కొత్త సంవత్సరానికి ప్రకటించనుంది. ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత ఈ పోస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

× ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు..

ఆర్థిక శాఖకు కీలకమైన ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయింది ఆర్థిక శాఖ. శాఖల వారీగా వివరాలు సేకరించింది. కొన్ని పోస్టులకు ఇప్పటికే ఆమోదం లభించింది. మరికొన్ని ఆ శాఖల పరిశీలనలో ఉన్నాయి. మరో రెండు మూడు రోజుల్లో ఈ పోస్టులపై ఒక క్లారిటీ రానుంది.

× ఇప్పటివరకు ఆర్థిక శాఖ ఆమోదం లభించిన పోస్టుల్లో 470 గ్రూప్ 2 పోస్టులు, 101 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ లభించింది.

× ప్రభుత్వం ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసింది. ఈ ఏడాది మరో 3 వేల పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్ లో పొందుపరచనుంది. యూనివర్సిటీలో బోధన సిబ్బంది పోస్టులకు సంబంధించి పదిహేను వందలు భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# మూడు రాజధానులతో జగన్..
# మూడు పార్టీలతో పవన్



నెల్లూరు, మార్చి 16, ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు తర్వాత ఎవరు అంటే కచ్చితంగా జగన్, పవన్, లోకేష్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. ఎందుకంటే ఆ ముగ్గురు ఎవరికి వారే ముద్ర చూపుకున్నారు. అయితే ప్రధానంగా జగన్ తో పాటు పవన్ రాజకీయ పార్టీలు ప్రారంభించి తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఆ ఇద్దరు నేతలది విభిన్నం. ఇద్దరూ తలోదారి తో ముందుకు సాగుతున్నారు. ఒకరు ఓటమితో ప్రస్థానాన్ని ప్రారంభించి.. గెలుపును అందుకున్నారు. మరొకరు విపరీతమైన సెంటిమెంట్ ప్రభావంతో గెలుపును అందుకొని.. భారీ ఓటమి మూటగట్టుకున్నారు. ఇద్దరికీ స్పష్టమైన తేడా ఉంది. అయితే పవన్ ఒక పద్ధతి ప్రకారం రాజకీయం చేస్తుండగా.. జగన్ తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు.వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసుడిగా కాంగ్రెస్ పార్టీ ఎంపీగా పొలిటికల్ ఎంట్రీ అదుర్స్ అనిపించారు జగన్మోహన్ రెడ్డి తండ్రి అకస్మిక మరణంతో వచ్చిన సెంటిమెంటును గుర్తించి ఓదార్పు యాత్రతో తనకు అనుకూలంగా మార్చుకున్నారు. అయితే ఒక రకమైన దూకుడు రాజకీయాన్ని అలవాటు చేసుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తరువాత పూర్తిగా పొలిటికల్ సీన్ మారిపోయింది. అప్పటివరకు ఉన్న రాజకీయ హుందాతనం పూర్తిగా మారిపోయింది. రాజకీయ వికృత క్రీడతో వ్యక్తిత్వ హరణం మొదలైంది అప్పటి నుంచే.అసలు రాజకీయాలతో సంబంధం లేని మహిళలను రాజకీయ వేదికలు ఎక్కించారు. వారితో సాటి మహిళలను ఆ గౌరవంగా మాట్లాడించారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన చట్టసభల్లో మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యాఖ్యానాలు చేశారు. రక్త సంబంధాలు, కుటుంబ సభ్యుల హత్యలను కూడా రాజకీయానికి వాడుకోవచ్చు అని నేటి తరానికి చేసి చూపించింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. ఒకే ఒక్క ఛాన్స్ అవకాశం ఇస్తే రాష్ట్ర రాజధానిని మూడు ముక్కలు చేస్తానని చేసి చూపించారు జగన్. అధికారం అనేది ప్రజల ప్రగతి కోసం కాదు.. ప్రత్యర్థి నేతల రాజకీయ కక్ష సాధింపుల కోసమని భావించారు జగన్మోహన్ రెడ్డి.పవన్ కళ్యాణ్ జనసేన ప్రస్థానాన్ని పరిశీలిస్తే మాత్రం.. తాము అధికారం కోసం కాదు ప్రజల గొంతుకై పని చేస్తామని చెప్పారు పవన్ కళ్యాణ్. ఎన్నెన్నో అవమానాలు, మరెన్నో అవహేళనలు ఎదుర్కొని.. మూడు పెళ్లిళ్లు అనే వ్యక్తిగత దాడిని భరిస్తూ.. ఓటమి అనే భారాన్ని అధిగమిస్తూ ముందుకు సాగారు పవన్ కళ్యాణ్. 100% సాలిడ్ గెలుపుతో.. అధికారం ఎవరి సొత్తు కాదు అని తేల్చి చెప్పారు. రాష్ట్ర బాగు కోసం తన స్థాయిని తగ్గించుకున్నారు. రాష్ట్ర ప్రజల ప్రగతి కోసం తన పార్టీ స్థానాన్ని కూడా తగ్గించుకొని మరి నెగ్గారు పవన్. అనుభవానికి పెద్ద పీట వేస్తూ చంద్రబాబు నాయకత్వానికి జై కొట్టారు. ప్రభుత్వం అంటే అందలం ఎత్తడం కాదు.. ప్రజల కోసం పనిచేయడం అని చాటి చెప్పారు. జగన్ మూడు రాజధానులతో ప్రాంతాలను, ప్రజలను విడగొడితే.. పవన్ మాత్రం మూడు పార్టీలతో జత కలిసి ఈ రాష్ట్ర భవితను మారుస్తున్నారు. అందుకే ఆ నేతలు ఇద్దరి మధ్య వైరుధ్యం పై మేధావులు ఎక్కువగా ఆలోచిస్తుంటారు. మొన్నటి వరకు పవన్ కళ్యాణ్ పై సినీ అభిమానమే ఉండేది. కానీ మేధావులతో పాటు తటస్థుల అభిమానాన్ని పొందుతున్నారు తన చర్యలతో పవన్.

## రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం



విశాఖపట్నంలో మరో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విశాఖ డైరీ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒక యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో యువతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మృతురాలిని ఆదారి మహాలక్ష్మిగా, గాయపడిన యువతిని చిప్పాడ అనూషగా గుర్తించారు. స్థానికుల మాటల్లో? వాహనం అతివేగంతో వచ్చి రోడ్డుపక్కన ఉన్న పోల్ను బలంగా ఢీకొట్టిందని చెబుతున్నారు. ఢీకొట్టిన వేగానికి యువతులు బంతుల్లా ఎగిరి రోడ్డుపై పడిపోయినట్లు అక్కడ ఉన్నవారు చెబుతున్నారు.

## మందుగుండు సామాగ్రి పేలి గోపాలపట్నం పరిధిలో భారీ పేలుడు

విశాఖపట్నం గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన భారీ పేలుడు స్థానికుల్లో తీవ్ర భయాందోళన కలిగించింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 89వ వార్డు ఆదర్శనగర్, ఎర్రచెరువు రజక కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది.

స్థానికుల సమాచారం ప్రకారం, రజక వీధిలో ఉన్న ఒక భవనంలో కొంతకాలంగా అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి తయారీ జరుగుతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఆదివారం అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పేలుడు శబ్దం దూర ప్రాంతాల వరకు వినిపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పేలుడు సంభవించిన వెంటనే ఆ భవనంలో మంటలు చెలరేగాయి. అయితే అక్కడున్న స్థానిక యువకులు ధైర్యంగా ముందుకు వచ్చి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. వారి సహకారంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు.

సమాచారం అందుకున్న వెంటనే గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సీఐ సన్యాసి నాయుడు, ఎస్సై రామారావు తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పోలీసులు పరిసర ప్రాంతాన్ని పూర్తిగా తనిఖీ చేస్తూ పేలుడు ఎలా జరిగింది, ఏ రకమైన మందుగుండు సామగ్రి అక్కడ తయారు చేస్తున్నారు అనే అంశాలపై దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో, ఆ భవనంలో అనధికారికంగా మందుగుండు సామగ్రి తయారీ జరుగుతున్న అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

భవన యజమాని వివరాలు సేకరిస్తూ, అక్కడ నిల్వ ఉంచిన పదార్థాలు ఏమిటి అనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు. భవనంలో ఇంకా ప్రమాదకర పదార్థాలు ఉన్నాయా అనే దానిపై కూడా జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో ఆదర్శనగర్, ఎర్రచెరువు రజక కాలనీ ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు భయాందోళనలో ఉండగా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు

## పాల్వంచలో ఇఫ్తార్ విందుకు ఎంపి వద్దిరాజు హాజరు

పాల్వంచ పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పాల్వంచ నటరాజ్ చౌరస్తా వద్ద ఉన్న జామామసీద్ లో ఏర్పాటు చేసిన ఈ విందుకు విచ్చేసిన ఎంపీ రవిచంద్ర,వనమా రాఘవలను స్థానిక ముస్లిం మత పెద్దలు పూలమాలలు శాలువాలతో సత్కరించారు.బీఆర్ఎస్ నాయకుడు మల్లెల రవిచంద్ర,ఆయన సతీమణి,37వ డివిజన్ కార్పొరేటర్ స్వప్నకుమారిల ఆధ్వర్యాన ఏర్పాటైన ఈ విందుకు సుమారు 1,000 మంది హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరు సంవత్సరాల బాలిక అత్యాచారం...హత్య

రంగారెడ్డి నార్సింగిలో దారుణం జరిగింది. చాక్లెట్ ఇప్పిస్తానంటూ నమ్మించి ఆరు ఏళ్ల బాలికపై కామాంధుడు రేప్ చేసి ఆపై హత్య చేసారదు.
బాలిక నిన్న సాయంత్రం నుండి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు తల్లి తండ్రులు నార్సింగి పోలీస్ స్టేషన్ పిర్యాదు చేసారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజ్ లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను పసిగట్టి....... హంతకుడిని పట్టుకున్నారు. రాత్రి ఒంటి గంటకు బాలిక మృతదేహాన్ని చూపించాడు. పోలీసులు రేప్ అండ్ మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డీజీపీ సమక్షంలో 11 మంది మావోయిస్టులు సరెండర్




భువనేశ్వర్ఒడిశాలోని కలహాండి జిల్లాలో డీజీపీ ఖురానియా సమక్షంలో డివిజనల్ కమిటీ సభ్యుడు నకుల్ సహా 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు పార్టీ క్యాడర్లు ఉన్నారు. వీరు ఒక ఏకే 47, ఒక ఇన్సాస్, నాలుగు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, నాలుగు సింగిల్ షాట్ తుపాకులు, భారీ మందుగుండు సామాగ్రిని పోలీసులకు అప్పగించారు. మహారాష్ట్రకు చెందిన నకుల్ ఒడిశా రాష్ట్ర కమిటీలో డిసిఎంగా పనిచేస్తున్నారు, అతనిపై రూ. 22 లక్షల రివార్డు ఉంది.

## నగరంలో 2. 44 కేజీల గంజాయి స్వాధీనం

మలక్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో ఎస్‌టీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించి, 359 గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం బరువు 2.44 కేజీలుగా గుర్తించారు. ఒక్కో పాకెట్‌లో 6?7 గ్రాముల గంజాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో సయ్యద్ మన్నన్ (31)ను అరెస్ట్ చేయగా, అక్రూర్ ఖాన్‌పై కూడా కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఆదివారం మలక్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

## కూరగాయల మాటున భారీగా గంజాయి తరలింపు

ఒడిశా నుంచి ఏపీలోకి అక్రమంగా తరలిస్తున్న 650 కిలోల గంజాయిని నార్కోటిక్ టీమ్ అధికారులు పట్టుకున్నారు. జాతీయ రహదారిపై అనుమానాస్పదంగా వస్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, కూరగాయల బుట్టల మాటున దాచిన 123 ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని ఒడిశా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు, గంజాయి రవాణా వెనుక ఉన్న ముఠాపై దర్యాప్తు ముమ్మరం చేశారు

## దుష్ప్రచారాలు నమ్మవద్దు.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ఏలూరు హైదరాబాద్ మొయినాబాద్ లో జరిగిన డిన్నర్ పార్టీ సంఘటనలో తనపై వచ్చిన కథనాలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఖండించారు. ఆదివారం పోలీసు విచారణ ముగించుకుని హైదరాబాద్ లోని తన నివాసానికి చేరుకున్న ఎంపీ మీడియాకు వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఎలాంటి వ్యక్తినో రెండేళ్లుగా ఏలూరు ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు అందరికీ తెలుసునన్నారు. తనకు ఎటువంటి దురలవాట్లు లేవని, ఏ తప్పు చేయలేదని, కేవలం ఒక స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే మొయినాబాద్ వెళ్ళానని, కలిసి వచ్చే సమయంలో జరిగిన కొన్ని సంఘటనలపై మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయని, వాటిని ఎవ్వరూ నమ్మవద్దని, పోలీసు విచారణకు సహకరిస్తానని, పూర్తి వివరాలతో త్వరలో ప్రజల ముందుకు వస్తానని ఎంపీ తన ప్రకటనలో తెలిపారు.

## కొప్పోలి సమీపంలో రోడ్డు ప్రమాదం
### కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని - యువకుడు మృతి



కడప వల్లూరు మండల పరిధిలోని కొప్పోలి బస్టాండ్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది..కడప తాడిపత్రి జాతీయ రహదారిలో కొప్పోలి బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనంను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది..ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు, ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన యువకుడిని 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు..అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే అతను మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు..మృతుడు కొప్పోలి గ్రామానికి చెందిన బాలాజీ 26గా గుర్తించారు..విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న వల్లూరు ఎస్సై శివ నాగిరెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు..అనంతరం కేసు నమోదు చేసి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ చేపట్టారు..ఈ ఘటనతో కొప్పోలి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది..యువకుడి మృతితో కుటుంబ సభ్యులు గ్రామస్తులు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు..

## పకడ్బందీగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

మైలవరం ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గవ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:30 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించగా, అనంతరం అధికారికంగా పరీక్షలు ప్రారంభమయ్యాయి.ఈ నెల 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్లు, రూమ్ అలాట్‌మెంట్లను సరిచూసుకున్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల వద్ద దించి, రూమ్ నంబర్లు చూసుకోవడంలో సహాయపడుతూ కనిపించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మైలవరం నియోజకవర్గవ్యాప్తంగా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## దూడను చంపిన పులి

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 17 రోజులుగా పెద్దపులి సంచారం స్థానికులకు నిద్ర లేకుండా చేస్తోంది. పులి ని పట్టుకునేందుకు అటవీశాఖ ప్రత్యేక బృందాల ప్రయత్నాలు కొనసాగుతున్నా ఇప్పటివరకు ఫలితం లేదు. ఆదివారం రాత్రి శంఖవరం మండలం మండపం వద్ద పోలం బూరయ్య అనే రైతు గేదె దూడ పై పులి దాడిచేసింది. ప్రస్తుతం శంఖవరం మండలం జి.కొత్తపల్లి సమీపంలో పెద్దపులి వున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రత్తిపాడు లేదా రౌతులపూడి మండలాల వైపు పయనించే అవకాశం వుందని సమాచారం...

# దివ్యాంగ విద్యార్థినికి రెండో అంతస్తులో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు

## తల్లి సాయంతో అవస్థలు పడుతూ కేంద్రానికి చేరుకున్న రేణుక

## ఆమె సెంటరు కిందకు మార్చితే కాస్త ఉపశమనం కలిగే అవకాశం

..తాను దివ్యాంగురాలినని కుమిలిపోలేదు. ఇంటిపట్టునే ఉండి తల్లిదండ్రులకు భారం కావాలని అనుకోలేదు. పట్టుదలతో చదివి ప్రయోజకురాలిని కావాలని కంకణం కట్టుకుంది. ఎవరెన్ని సూటిపోటి మాటలు అన్నా తనని కాదనుకుంది. చదువుపై ఉన్న మక్కువతో పదో తరగతి పరీక్షలు రాసి తన సత్తా నిరూపించుకోవాలనుకుంది. ఆమెకు పరీక్ష రాసే హాలు రెండో అంతస్తులో కేటాయించడంతో అమ్మే



ఆమెకు ఆసరా అయ్యింది. కూతురును రెండో అంతస్తుకు ఎత్తుకొని మెట్ల మార్గంలో తీసుకెళ్లడం.. దివ్యాంగ కూతురు పరీక్ష రాయడం ఇద్దరికీ ఒక పరీక్షే అయ్యింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన కొండూరి జానయ్య–శారద దంపతులకు కుమార్తె రేణుకతోపాటు ఇద్దరు కుమారులు. భార్యాభర్తలు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే చిన్నతనం నుంచే ఎదుగుదల లేని స్థితిలో ఉన్న రేణుకకు చదువంటే చాలా మక్కువ. ఆమె పట్టుదలతో చదివి పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమైంది. ఈ తరుణంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో నడవలేని తన కూతురును ఎత్తుకొని తల్లి కూసుమంచి మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చింది. ఆమెకు రెండో అంతస్తులో గది కేటాయించడంతో తన బిడ్డను చంటి పిల్లలా ఎత్తుకొని ఇబ్బందులు పడుతూ సీట్లో కూర్చోబెట్టింది. పరీక్ష ముగిసిన తర్వాత తల్లి మళ్లీ కూతురు రేణుకను ఎత్తుకొని ఇంటికి తీసుకెళ్లింది. రేణుక పరీక్షరాసే కేంద్రాన్ని కిందకు మార్చినట్లైతే కొంత ఉపశమనం కలినట్లవుతుంది. రేణుకకు దివ్యాంగురాలి సర్టిఫికెట్ ఉన్నా, ఆమె పరీక్ష రాయడానికి సహాయకులను తీసుకునే అవకాశం ఉన్నా తానే స్వయంగా పరీక్ష రాస్తానని కేంద్రానికి వచ్చింది. కాగా, తన కూతురు బాగా చదువుకుంటుంది. మాకు చదివించాలనే ఉంది కానీ ఈ పరిస్థితుల్లో ఎత్తుకొని ఎంత దూరం తీసుకెళ్లగలం అంటూ తల్లి పరీక్ష కేంద్రం బయట తన ఆవేదన వ్యక్తం చేసింది.

# బీజేపీ బిగ్ ఆఫర్... లైట్ తీసుకున్న విజయ్



చెన్నై, మార్చి 16, (న్యూస్ పల్స్) మిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. తమిళ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్‌ను తమ కూటమిలోకి తెచ్చుకునేందుకు భారతీయ జనతా పార్టీ .. చివరిగా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా విజయ్‌కు బిజెపి అధిష్టానం బంపర్ ఆఫర్ ప్రకటించినట్లు తెలుస్తోంది. పొత్తులో భాగంగా టీవీకేకు 80 అసెంబ్లీ సీట్లతో పాటు, ఎన్నికల అనంతరం విజయ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చేందుకు కూడా బిజెపి ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే, బిజెపి ఇచ్చిన ఈ భారీ ఆఫర్ పట్ల విజయ్ ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తన పార్టీ సిద్ధాంతాలకు, బిజెపి భావజాలానికి పొంతన లేదని భావిస్తున్న విజయ్, ప్రస్తుతం ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు బీజేపీ ఈ ఆఫర్ విజయకు పంపింది. జాతీయ పార్టీతో చేతులు కలిపితే తన పార్టీ మూలాలకే ముప్పు వస్తుందని విజయ్ పొత్తు ఆలోచనలు అసలు పెట్టుకోలేదని తెలుస్తోంది. చాలా ఒత్తిడి వచ్చినప్పటికీ విజయ్ తగ్గడం లేదు. రాష్ట్రంలో డీఎంకే వంటి బలమైన శక్తిని ఎదుర్కోవాలంటే విజయ్ వంటి ప్రజాకర్షణ ఉన్న నాయకుడి మద్దతు అవసరమని బిజెపి భావిస్తోంది. అందుకే గత కొంతకాలంగా విజయ్‌తో సంప్రదింపులు జరుపుతోంది. 80 సీట్లు ఇవ్వడం ద్వారా కూటమిలో టీవీకేను కీలక భాగస్వామిని చేయాలని బిజెపి యోచించినా, విజయ్ మాత్రం తన రాజకీయ స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. బిజెపి ఆఫర్ చేసిన డిప్యూటీ సీఎం పదవిని కూడా ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. విజయ్ నిర్ణయంతో తమిళనాడులో త్రిముఖ పోటీ ఖాయమని అర్థమవుతోంది. డీఎంకే నేతృత్వంలోని కూటమి ఒకవైపు, ఏఐఏడీఎంకే, బీజేపీ కూటమి మరోవైపు ఉండగా.. విజయ్ తన టీవీకే పార్టీతో మూడవ శక్తిగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బిజెపి ఆఫర్‌ను తిరస్కరించడం ద్వారా తాను ఎవరికీ బి–టీమ్ కాదని, స్వతంత్రంగా ప్రజల తీర్పును కోరుకుంటున్నానని విజయ్ స్పష్టమైన సంకేతాలు పంపినట్లయింది. ఈ పరిణామం రాబోయే ఎన్నికల్లో ఓట్ల చీలికకు దారితీస్తుందా లేదా విజయ్ కింగ్‌మేకర్‌గా మారుతారా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

## బీజేపీ వైపు మల్లారెడ్డి కోడలు చూపు

హైదరాబాద్, మార్చి 16, తెలంగాణ రాజకీయాల్లో మల్లారెడ్డికి ఓ ప్రత్యేకత. పాలమ్మినా..కట్టెలమ్మినా అని చెప్పుకుంటూ ఉంటారు కానీ ఆయన కుబేరుడు. ఆయన ప్రజల్లోకి వెళ్లే విధానంలో ఆయనకో ప్రత్యేకత ఉంది. టీడీపీ నుంచి మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికైన ఆయన ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అల్లుడ్ని కూడా ఎమ్మెల్యే చేశారు. అయితే ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరమవ్వాలని నిర్ణయించుకున్నారు. అందుకే కోడలు ప్రీతిరెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. ఆమె కూడా ఆసక్తిగా ఉన్నారు. ఇంటర్వ్యూలు ఇస్తూ తాను ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధమవుతున్నట్లుగా సంకేతాలిస్తున్నారు. ల్లారెడ్డి కుమారుడు భద్రా రెడ్డి భార్య అయిన ప్రీతిరెడ్డి గత కొంతకాలంగా మేడ్చల్ నియోజకవర్గంలో చురుగ్గా కనిపిస్తున్నారు. వృత్తిరీత్యా వైద్యురాలైన ఆమె విద్యా సంస్థల నిర్వహణలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. మల్లారెడ్డి వయసు రీత్యా రాజకీయాలకు దూరమవ్వాలని భావిస్తుండటంతో తన వారసురాలిగా కోడలిని ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఆమె తన మాటతీరుతో ప్రజలను ఆకట్టుకుంటూ రాజకీయ నాయకురాలికి ఉండాల్సిన లక్షణాలను ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం మల్లారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయన కోడలు మాత్రం భారతీయ జనతా పార్టీ వైపు ఆసక్తి చూపిస్తుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె ఇచ్చే ఇంటర్వ్యూలలో బీజేపీ సిద్ధాంతాలను సమర్థించడం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రశంసించడం గమనిస్తే ఆమె రాజకీయ గమ్యం ఖరారైందని అర్థమవుతోంది. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేయాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. ప్రీతిరెడ్డి కేవలం మల్లారెడ్డి కోడలిగానే కాకుండా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంటున్నారు. విద్యావంతురాలు కావడం మల్లారెడ్డి గ్రూపు సంస్థల నిర్వహణలో అనుభవం ఉండటం ఆమెకు కలిసి వచ్చే అంశాలు. రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యత పెరగాలని ఆమె గట్టిగా వినిపిస్తున్నారు. సామాజిక అంశాలపై ఆమెకు ఉన్న అవగాహన విశ్లేషణాత్మక ధోరణి ఆమెను ఇతర రాజకీయ వారసుల కంటే భిన్నంగా నిలబెడుతున్నాయి. రాజకీయాల్లోకి రావడం అంటే కేవలం పదవుల కోసం కాదని ప్రజా సేవ చేయడమే తన లక్ష్యమని ఆమె చెబుతున్నారు. మల్లారెడ్డి తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. ఇప్పుడు తన కుటుంబాన్ని రాజకీయంగా సుస్థిరం చేసేందుకు కోడలిని ముందు వరుసలో నిలబెట్టారు. అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇప్పటికే ఎమ్మెల్యేగా ఉండగా ఇప్పుడు కోడలిని ఎంపీగా చూడాలన్నది ఆయన కోరిక. అయితే బీఆర్ఎస్ లో ఉంటే భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న సందిగ్ధంలో ఉన్న మల్లారెడ్డి తన కోడలిని బీజేపీలోకి పంపడం ద్వారా అన్ని పార్టీలతో సత్సంబంధాలు కొనసాగించాలనే వ్యూహంతో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇది ఒక రకంగా సేఫ్ గేమ్ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజిగిరి నియోజకవర్గం తెలంగాణలోనే అతిపెద్ద పార్లమెంట్ స్థానం. ఇక్కడ విద్యావంతులు సెటిలర్లు ఎక్కువగా ఉంటారు. ఈ ఓటర్లను ఆకట్టుకోవాలంటే ప్రీతిరెడ్డి లాంటి కొత్త తరం నాయకురాలు సరైన ఎంపిక అని మల్లారెడ్డి భావిస్తున్నారు. ఆమెకు ఉన్న సాఫ్ట్ ఇమేజ్ బీజేపీకి ఉన్న కేడర్ బలం తోడైతే విజయం సులభం అవుతుందని వారి అంచనా. క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని పట్టుకునేందుకు ఆమె ఇప్పటికే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టారు. తెలంగాణ రాజకీయాల్లో మహిళా నాయకత్వం తక్కువగా ఉన్న తరుణంలో ప్రీతిరెడ్డి వంటి వారు విజయవంతం అవుతారని భావిస్తున్నారు. ఆమె తన మామ మల్లారెడ్డి లాగా మాస్ గా కాకుండా క్లాస్ గా వ్యవహరిస్తూ యువతను ఆకట్టుకుంటున్నారు. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే మల్లారెడ్డి కుటుంబం నుంచి ఒక శక్తివంతమైన మహిళా నాయకురాలు ఉద్భవించే అవకాశం ఉంది. ఈ ప్రయాణం ఎటువైపు దారితీస్తుందో ఎన్నికలు తేల్చనున్నాయి.

# చిల్కానగర్లో ఏఆర్ కానిస్టేబుల్ హత్య



మేడ్చల్ ఉప్పల్ పిఎస్ పరిధి చిలకానగర్ లో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. చిలకానగర్ ఆదర్శనగర్లోని సాయిబాబా ఆలయం సమీపంలో జరిగిన కత్తిపోటు ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. చెంగిచెర్లలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సుధీర్ కుమార్ (39), హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్లో ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఆదర్శనగర్, చిల్కానగర్లోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉండగా, అతని స్నేహితుడైన సంతోష్ నాయక్ కత్తితో దాడి చేసినట్లు తెలుస్తుంది.

సంతోష్ నాయక్ సుధీర్ కుమార్ ని కడుపు మరియు మెడ భాగాల్లో కత్తితో పొడవడంతో, తీవ్ర గాయాల కారణంగా సుధీర్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. మృతుడు మరియు నిందితుడు ఇద్దరూ స్నేహితులేనని, అయితే హత్యకు గల అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించనున్నారు. కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడు సంతోష్ నాయక్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# టీడీపీ కార్యక్రమాలకు పుట్టా మహేష్ దూరం

ఏలూరు, విజయవాడ, మార్చి 16, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో పట్టుబడటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అత్యంత కఠినంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణ, నైతిక విలువల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తుందని ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం తక్షణమే రంగంలోకి దిగింది. ఎంపీ పుట్టా మహేష్‌ను పార్టీ కార్యక్రమాలన్నింటికీ తక్షణమే దూరం పెడుతున్నట్లు ప్రకటించింది.

రాజకీయాలకు అతీతంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్న తరుణంలో, సొంత పార్టీ ఎంపీపైనే ఇలాంటి ఆరోపణలు రావడంతో అధిష్టానం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కేసు విచారణ పూర్తయ్యే వరకు ఆయన పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధం విధించినట్లు సమాచారం. అంతేకాకుండా, ఈ ఘటనపై వివరణ కోరుతూ పుట్టా మహేష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా తనపై వచ్చిన ఆరోపణలపై తగిన వివరణ ఇవ్వాలని, ఒకవేళ అది సంతృప్తికరంగా లేకపోతే తదుపరి చర్యలు ఉంటాయని పార్టీ వర్గాలు హెచ్చరించాయి. సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు అయినప్పటికీ, పార్టీ నిబంధనల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని చంద్రబాబు ఈ చర్య ద్వారా సంకేతాలు పంపారు. ఎంపీ వివరణ అనంతరం పార్టీ ఇంకా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అంతా పొలిటికల్ ఫ్యామిలీ...

గ్స్ కేసులో పట్టుబడ్డ పుట్టా మహేష్ వారసత్వమే అర్హతగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు ఎంపీగా టిక్కెట్ కేటాయించడంలో బలమైన రాజకీయ వారసత్వం, సీనియర్ నేతల అండదండలు కీలక పాత్ర పోషించాయి. ఆయన తండ్రి పుట్టా సుధాకర్ యాదవ్ తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా, టీటీడీ మాజీ ఛైర్మన్‌గా పనిచేయడం మహేష్‌కు రాజకీయ ఓనమాలు నేర్పింది. ప్రస్తుతం ఆయన మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. మహేష్ కుమార్ కేవలం తన తండ్రి వారసుడిగానే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దిగ్గజ నేతగా పేరొందిన యనమల రామకృష్ణుడికి అల్లుడు కావడం ఆయన రాజకీయ బలాన్ని రెట్టింపు చేసింది. యనమల వంటి వ్యూహకర్త కుటుంబంతో బంధుత్వం ఉండటం వల్ల పార్టీ అధిష్టానం వద్ద మహేష్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సమీకరణాల వల్లే యువకుడైనప్పటికీ, 2024 ఎన్నికల్లో ఏలూరు వంటి కీలకమైన పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసే అవకాశం ఆయనకు దక్కింది. మహేష్ కుమార్ భార్య యనమల దివ్య కూడా ప్రస్తుతం తుని ఎమ్మెల్యేగా ఉన్నారు. అదే సమయంలో తెలంగాణలోని బలమైన యాదవ సామాజిక వర్గ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబంతో ఉన్న వియ్యం కూడా మహేష్‌కు అదనపు బలాన్ని చేకూర్చింది. మహేష్ కుమార్ సోదరిని తలసాని కుమారుడు సాయికిరణ్ వివాహం చేసుకున్నారు. ఇలా రెండు రాష్ట్రాల్లోని ముగ్గురు సీనియర్ నేతల నీడలో మహేష్ రాజకీయం సాగుతోంది. ఈ భారీ రాజకీయ నేపథ్యం వల్లే ఆయనకు అనతి కాలంలోనే ఎంపీగా ఎదిగే అవకాశాలు వచ్చాయి. అయితే ఇప్పుడు డ్రగ్స్ కేసులో ఇరుక్కుని ఆయన తీవ్ర వివాదాస్పదం అయ్యారు. కొద్దిరోజులకు ఆయన కేసు నుంచి బయటపడతారేమో కానీ రాజకీయంగా మరోసారి అవకాశాలు రావడం మాత్రం కష్టమని అనుకోవచ్చు.

# కొత్త పన్నుల కోసం ప్రయత్నాలు 16 దేశాలపై మరోసారి ఫోకస్ చేసిన ట్రంప్!



చెన్నై, మార్చి 16, (న్యూస్ పల్స్) అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ భారత్, చైనా, బంగ్లాదేశ్ సహా 16 ప్రధాన వాణిజ్య భాగస్వాములపై ??కొత్త ఎంక్వయిరీ ప్రారంభించింది. ఈ దర్యాప్తును యుఎస్ వాణిజ్య చట్టం 1974లోని సెక్షన్ 301 కింద నిర్వహిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం, అమెరికా ఏ దేశంపైనా టారిఫ్స్ లేదా దిగుమతి పన్నులను పెంచవచ్చు. గత నెలలో యుఎస్ సుప్రీంకోర్టు ట్రంప్ పరిపాలన విధించిన సుంకాలను చట్టవిరుద్ధమని ప్రకటించి వాటిని కొట్టివేసిన తర్వాత ఈ చర్య వచ్చింది. దీని తరువాత, యుఎస్ ఇప్పుడు కొత్త దర్యాప్తు ద్వారా మళ్ళీ ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. దర్యాప్తులో అవకతవకలు బయటపడితే, అనేక దేశాలపై కొత్త సుంకాలు విధించే అవకాశం ఉందని అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ అన్నారు. దీని ప్రభావం పడే దేశాలలో చైనా, యూరోపియన్ యూనియన్, భారత్, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో ఉన్నాయి. ఈ దర్యాప్తు అధిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న దేశాలను లేదా అమెరికాకు వస్తువులను విక్రయించే దేశాలను లక్ష్యంగా చేసుకుంది. ఇది దేశీయ పరిశ్రమలకు ఇబ్బంది కలిగిస్తుందని అమెరికా చెబుతోంది. దర్యాప్తులో చేర్చిన ఇతర దేశాల్లో తైవాన్, వియత్నాం, థాయిలాండ్, మలేషియా, కంబోడియా, సింగపూర్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, స్విట్జర్లాండ్, నార్వే ఉన్నాయి. అమెరికా రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన కెనడాను మాత్రం ఈ జాబితాలో చేర్చలేదు. ఈ దర్యాప్తు 60 కంటే ఎక్కువ దేశాలను కవర్ చేయనుంది. గతంలో, చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతం నుంచి దిగుమతి అయ్యే సౌర ఫలకాలు, ఇతర ఉత్పత్తులపై అమెరికా చర్య తీసుకుంది. ఈ చర్య ఉయ్ఘర్ ఫోర్స్డ్ లేబర్ ప్రొటెక్షన్ చట్టం కింద తీసుకుంది, ఇది మాజీ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పరిపాలనలో ఆమోదించారు. చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతంలో ఉయ్ఘర్ ముస్లిం కమ్యూనిటీ సభ్యులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని అమెరికా ఆరోపిస్తోంది. అయితే, చైనా ఈ ఆరోపణలను ఖండిస్తూనే ఉంది. ఈ దర్యాప్తు త్వరగా పూర్తి అయ్యేందుకు గడువు విధించారు. ఏప్రిల్ 15 వరకు అభిప్రాయాలను తీసుకుంటుంది. మే 5వ తేదీ నాటికి బహిరంగ విచారణ జరుగుతుంది. ఆ తర్వాత జూలై నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని ప్లాన్ చేశారు. జూ వాణిజ్య లోటును తగ్గించి, దేశీయ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్యను ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ చెబుతోంది.

సెక్షన్ 301 అంటే ఏమిటి?

1974 నాటి జూ వాణిజ్య చట్టంలో సెక్షన్ 301 ఒక కీలకమైన భాగం. ఏదైనా దేశం అన్యాయమైన లేదా చట్ట వ్యతిరేక వాణిజ్య పద్ధతుల్లో వ్యాపారం చేస్తుందని జూ విశ్వసించినప్పుడు ఈ చట్టం ప్రయోగిస్తుంది. ఈ చట్టం ప్రకారం, జూ ఆ దేశంపై దర్యాప్తు ప్రారంభించవచ్చు. అవసరమైతే, సుంకాలు లేదా ఇతర వాణిజ్య పరిమితులను విధించవచ్చు. ఈ చట్టం ప్రకారం, జూ ప్రభుత్వ వాణిజ్య విభాగం అయిన యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం ఒక దేశ వాణిజ్య విధానాలను పరిశీలిస్తుంది.

## పదోతరగతి పరీక్షలు ప్రారంభం

చిత్తూరు జిల్లా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్న పోలీసులుచిత్తూరు జిల్లాలో ఇవాళ నుండి వచ్చే నెల ఏప్రిల్ 1 తేదీ వరకు పదో తరగతి (౹ూాఅ) పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతున్నాయి. పరీక్షలు పకడ్బందీగా, పారదర్శకంగా, ఎటువంటి కాపీయింగ్ కి అస్కారం లేకుండా నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. చిత్తూరు జిల్లాలో మొత్తం 129 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, 1,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 12 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, 6 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌తో నిఘా పెట్టారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 10 నిమిషాల ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారు. దాని తరువాత అనుమతి ఉండదు. విద్యాశాఖ పోలీసుల సమన్వయం తో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ప్రారంభం అయ్యాయి.

# ప్రతిపక్ష పార్టీ అయ్యేలా కవిత వ్యూహమా?



హైదరాబాద్, మార్చి 16, ఐయామ్ వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్. ప్రజల గొంతుగా నిలబడతా. ఎప్పుడో ఓసారి తెలంగాణకు ముఖ్యమంత్రిని అయి తీరుతా. జాగృతి అధ్యక్షురాలు కవిత స్టేట్‌మెంట్స్ ఇవి. బీఆర్ఎస్‌ను వీడినప్పటి నుంచి ప్రత్యేక రాజకీయ ఎజెండాతో ముందుకెళ్తున్న కవిత.. ఓవైపు పార్టీ ఏర్పాటు కోసం కసరత్తు చేస్తూనే..అసలు సిసలు ప్లాన్‌ను ఇంప్లిమెంట్ చేస్తున్నారు. పరిస్థితులను బట్టి..పొలిటికల్ ఈక్వేషన్స్ బేరీజు వేసుకుని..ఆల్ ఆఫ్ సడెన్‌గా ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టారు. వరుస కార్యక్రమాలు, మెరుపు ధర్నాలు, దీక్షలతో అధికార కాంగ్రెస్ తీరుపై నిరసన తెలుపుతూనే..ఇటు బీఆర్ఎస్, బీజేపీపై విమర్శల దాడిని కంటిన్యూ చేస్తున్నారు. ఓ రకంగా తానే అసలైన ప్రతిపక్షం అన్న లెవల్‌కు ఎదిగేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారట కల్వకుంట్ల కవిత.త్వరలోనే రాజకీయ పార్టీని ప్రకటించేందుకు రెడీ అవుతున్నారు కవిత. అంతలోపే అంశాల వారీగా తనదైన శైలితో పోరాటం మొదలుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై ఫైట్ చేస్తూ వస్తున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా తన దృష్టికి వచ్చిన ప్రతి అంశంపై రియాక్ట్ అవుతున్నారు కవిత. హైదరాబాద్ నుంచి మొదలు రాష్ట్రంలో ఎక్కడ ప్రజల సమస్యలు ఉంటే అక్కడికి వెళ్తున్నారామె. అంశాన్ని బట్టి నిరసనలు, ధర్నాలు చేస్తూ..వార్తల్లో నిలుస్తున్నారు. ఇక సమస్య తీవ్రతను బట్టి మెరుపు దీక్షలు, చివరికి ఆమరణ నిరాహార దీక్షకు కూడా దీగడంతో కవిత రాజకీయ వ్యూహంపై అసక్తికరమైన చర్చ మొదలైంది.జనం బాట పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన కవిత..ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగుల కోసం ఇందిరా పార్క్ దగ్గర దీక్ష చేశారు కవిత. హైదరాబాద్‌లో మూసీ పక్కన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అక్రమంగా నిర్మాణాలు చేస్తోందని మెరుపు ధర్నాతో నిరసన తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా మహిళలకు 2,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్ ముందు ధర్నా నిర్వహించారు కవిత. జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తి రైతుల సమస్యలపై కలెక్టరేట్ దగ్గర ప్రొటెస్ట్ చేశారు. రైతు సంఘర్షణ సభ తర్వాత కలెక్టరేట్‌కు వెళుతుండగా పోలీసులు అడ్డుకోవడంతో, అక్కడే బైఠాయించి నిరసన తెలిపి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.లేటెస్ట్‌గా ఖమ్మం వెలుగుమట్ల బాధితుల తరపున కవిత ఏకంగా నిరాహార దీక్ష చేయడం పొలిటికల్ హాట్ టాపిక్ అయింది. వెలుగుమట్ల బాధితుల ఇళ్లు కూల్చడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన కవిత..మళ్లీ అక్కడే వాళ్లకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఖమ్మంలో దీక్ష చేస్తున్న కవితను పోలీసులు హైదరాబాద్ తరలించినా..దీక్షను కొనసాగించారు. చివరికి ప్రభుత్వం వెలుగుమట్ల బాదితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో మూడు రోజుల నిరాహార దీక్షను విరమించారు కవిత. ఇలా వరుసగా ప్రజా సమస్యలపై నిరసనలు, పోరాటాలు, దీక్షలు చేయడం వెనుక ఆమె రాజకీయ వ్యూహం ఏమై ఉంటుందన్న చర్చ మొదలైంది. అంత ఆశామాషీగా కవిత ఇదంతా చేయడం లేదని, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని చెబుతున్నారు.వచ్చే నెలలో రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న కవిత..అంతకుముందే తనను తాను ప్రూవ్ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, జనం పక్షాన నిలుస్తున్నాననే ఇండికేషన్ ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రతిపక్ష, విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను వెనక్కినెట్టి తాను అపోజిషన్ రోల్ ప్లే చేయాలని కవిత స్కెచ్ వేస్తున్నట్లు చెబుతున్నారు. నిరసనలు, ధర్నాలు, దీక్షలు చేయడం ద్వారా బీఆర్ఎస్, బీజేపీల కంటే ఎక్కువగా తాను జనంలో ఉంటూ పబ్లిక్ వాయిస్‌గా ఎస్టాబ్లిష్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. తానే అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్నట్లు చెప్పకనే చెప్పే ప్రయత్నం చేస్తున్నారట కవిత. రాజకీయ పార్టీ పెట్టాక మరింత దూకుడు పెంచి బీఆర్ఎస్, బీజేపీకి ఆల్టర్‌నేట్ అయ్యేలా వ్యూహం అమలు చేస్తున్నారట. తెలంగాణ పొలిటికల్ సినారియోలో కవిత ప్లాన్ లు ఎంత వరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# గులాబీ గూటికి జీవన్ రెడ్డి



కరీంనగర్, మార్చి 16, తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ మారే అవకాశం కనిపిస్తోంది. జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో జీవన్ రెడ్డికి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మధ్య ఎప్పటి నుంచో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం ఉంది. గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి గెలవగా, జీవన్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే, అనూహ్యంగా సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం , పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డికి మింగుడుపడటం లేదు. తనను సంప్రదించకుండానే బద్ధ శత్రువును పార్టీలోకి తీసుకోవడం తనను అవమానించడమేనని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పార్టీపై ఆయన చాలా కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇటీవల ఆయన తాను పార్ట మారే ఆలోచనలో ఉన్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీ తర్వాత ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి, గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జగిత్యాలలోని తన అనుచరులతో, కీలక నేతలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ మార్పుపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ పూర్తి చేశారని, మెజారిటీ అనుచరులు ఆయన నిర్ణయానికి మద్దతు తెలిపారని సమాచారం.జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ వీడకుండా ఉండేందుకు కాంగ్రెస్ అధిష్టానం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, సంజయ్ కుమార్ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన గట్టిగా ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడితే, ప్రత్యర్థిని తెచ్చి నెత్తిన కూర్చోబెట్టడం ఏమిటి అని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ పరిణామా కారాణం ఆయన వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదని చెబుతున్నారు. ఒకవేళ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే, జగిత్యాల నియోజకవర్గంలో సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. కాంగ్రెస్ కేడర్‌లో చీలక రావడం ఖాయం. అటు బీఆర్ఎస్‌కు ఈ సీనియర్ నేత రాక పెద్ద బలాన్ని ఇస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. పార్టీ మారే అంశంపై జీవన్ రెడ్డి నుంచి త్వరలోనే ఒక అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీతో తాటిపర్తి జీవన్ రెడ్డికి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విడదీయలేని అనుబంధం ఉంది. 1980వ దశకంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, జగిత్యాల నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఆ ప్రాంతంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు, భవనాల శాఖ వంటి కీలక మంత్రి పదవులను నిర్వహించిన జీవన్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఓటమి ఎదురైనప్పుడు కూడా పార్టీని వీడకుండా విధేయుడిగా ఉన్న ఆయన తెలంగాణ ఉద్యమం తర్వాత వెనుకబడిపోయారు. వరుసగా ఓడిపోతూ వస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసినా ఓడిపోయారు

## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, 2026 మార్చి 16 తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మార్చి 19వ తేదీ ఉగాది ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. తరువాత ఉదయం 7 నుండి 9 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధి, శ్రీ పార్థసారథి స్వామివారి సన్నిధి, శ్రీ ఆండాల్ అమ్మవారు, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ పుండరికవల్లీ ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం ఉదయం 9.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

# పోలీసులమని చెప్పినా కాల్పులు జరిపారు

హైదరాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీపై నమోదయిన ఎఫ్ఐఆర్ కీలక అంశాలు బయటపడ్డాయి. డ్రగ్స్తో పాటు మందు పార్టీ జరిగింది. మద్యం, కొకైన్ కలుపుకొని తాగారు. పదకొండుమందికి పరీక్షలు చేయగా ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. పోలీసులమని చెప్పినా కాల్పులు జరిపారు. రితేష్రెడ్డి రివాల్వర్ స్వాధీనం చేసుకున్నాం. నమిత్ శర్మ కాల్పులు జరిపినట్టు గుర్తించాం.సిమ్లాలో కొకైన్ కొన్నట్టు కౌశిక్ అంగీకరించాడు. రోహిత్రెడ్డి ఆహ్వానం మేరకే పార్టీకి వచ్చారని పోలీసుల ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు.

# మల్లారెడ్డి... ఆయన కోడలు జోరుగా... హుషారుగా...

హైదరాబాద్, మార్చి 16, కొందరికి ఏజ్ పెరుగుతుంటే రకరకాల వ్యాధులు వస్తుంటాయి. మరికొందరికి ఏమో ఏజ్ పెరుగుతుంటే ఎక్కడా లేని ఉత్సాహం వస్తూ ఉంటుంది. పైగా యుక్త వయసులో ఉన్నప్పుడు చేయలేని పనులను ఈ ఏజ్ లో చేస్తుంటారు. ఈ జాబితాలో మాజీ మంత్రి మల్లారెడ్డి అలియాస్ పాల మల్లారెడ్డి ముందు వరుసలో ఉంటారు.పాలమ్మిన, పూలమ్మిన, కష్టపడ్డ, సక్సెస్ ఐన.. అని అప్పట్లో మల్లారెడ్డి చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాను ఊపేసింది. ఆ తర్వాత ఆయన సోషల్ మీడియా స్టార్ అయిపోయారు. పూలమ్మిన.. పాలమ్మిన.. ఈ డైలాగ్ చెప్పగానే గుర్తొచ్చే పేరు.. మల్లారెడ్డి. టీడీపీలో రాజకీయం మొదలు పెట్టి.. బీఆర్ఎస్‌లో చేరిన చేమకూర మల్లారెడ్డి వ్యాపారంలోనూ, ఇటు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. మోటివేటర్‌గా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో వ్యాపారంలో రాణిస్తున్నారు మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి. మల్లారెడ్డి వారసురాలిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న ప్రీతిరెడ్డి.. రాజకీయ వారసత్వాన్ని పునికిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రీతిరెడ్డి రాజకీయ ప్రవేశం గురించి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి.మల్లారెడ్డి విద్యా సామ్రాజ్యంలో కీలకంగా పనిచేస్తున్న ప్రీతి రెడ్డి ఇటీవల సోషల్ మీడియా ద్వారా ఎలివేట్ అయ్యారు. ఈ సమావేశాల్లో ఆమె విద్యా మౌలిక సదుపాయాలు, ప్రాంతీయ అభివృద్ధి విషయాలతోపాటు ఆర్థిక అసమానతలు, దారిద్ర్య నిర్మూలన, స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యం, యువతకు అవకాశాలు వంటి విస్తృత అంశాలపై చర్చించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉపాధి అవకాశాలు పెంచాలని, సామాజిక న్యాయం అందించాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఆమెను సామాన్యుల సమస్యలకు సున్నితంగా ఉన్న నాయకురాలిగా చిత్రీకరిస్తున్నాయి.ప్రీతి రెడ్డి ఇటీవల ఓ ఇంటర్వ్యూల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలను మెచ్చుకున్నారు. ముఖ్యంగా, కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) ద్వారా విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు, ఆర్థిక సంస్కరణలు, మహిళా సాధికారత కార్యక్రమాలు గురించి ఆమె ప్రశంసలు ఆకట్టుకున్నాయి. బీజేపీ పాలనలో దేశవ్యాప్త అభివృద్ధి, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను ఆమె సమర్థించడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు బదులు జాతీయ పార్టీతో ఆమె భవిష్యత్తు లింక్‌ను సూచిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రీతిరెడ్డి రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న ఊహాగానాలపై మల్లారెడ్డి కుటుంబం స్పందించలేదు. ప్రతీరెడ్డి వ్యాఖ్యలను ఖండించలేదు. మల్లారెడ్డి కుటుంబం ఇప్పటికే తెలంగాణలో బలమైన రాజకీయ, విద్యా ప్రభావం కలిగి ఉంది. ప్రీతి రెడ్డి ప్రవేశం కుటుంబ ప్రభావాన్ని మరింత బలోపేతం చేస్తుందని అంచనా. రాబోయే స్థానిక ఎన్నికలు లేదా అసెంబ్లీ ఎన్నికల ముందు ఆమె అధికారిక ప్రవేశం జరిగే అవకాశం ఎక్కువ.ప్రీతిరెడ్డి రాజకీయ ప్రవేశం తెలంగాణలో కుటుంబ రాజకీయాలకు కొత్త డైమెన్షన్ ఇస్తుంది. బీఆర్ఎస్‌లోనే చేరినా, ఆమె జాతీయ విధానాల పట్ల ఆకర్షణ బీజేపీతో కూటమి ఏర్పడే సూచనలు ఉన్నాయి. తెలంగాణలో బీజేపీ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, ఆమె ప్రవేశం పార్టీకి కొత్త యువ, మహిళా ముఖాన్ని ఇస్తుంది.ఇక అప్పటినుంచి మల్లారెడ్డి ఏం మాట్లాడినా సరే.. ఏం చేసినా సరే సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. వాస్తవానికి మల్లారెడ్డి వయసు ఇప్పుడు ఏడు పదులు దాటింది. అయినప్పటికీ ఆయన యంగ్ గా కనిపిస్తున్నారు. ఉత్సాహానికి ప్రతీకగా దర్శనమిస్తున్నారు.మల్లారెడ్డి తన 50వ వివాహ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో నిర్వహించిన సంగీత్ వేడుకలో మల్లారెడ్డి అదరగొట్టారు. హుక్ స్టెప్పులతో అలరించారు. వయసు అనేది శరీరానికి మాత్రమేనని.. మనసుకు కాదని ఆయన నిరూపించారు. షేర్వాని ధరించి.. మెడలో గులాబీ కండువా వేసుకొని.. కళ్ళకు గాగుల్స్ తో అచ్చం మాస్ హీరో లాగా కనిపించారు మల్లారెడ్డి.మల్లారెడ్డి వేసిన స్టెప్పుల సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా సర్కులేట్ అవుతున్నాయి. “ఒక వయసుకు వచ్చిన తర్వాత శరీరం సహకరించదు. కానీ మల్లారెడ్డి విషయంలో ఇందుకు పూర్తి విరుద్ధం. ఆయనకు అన్ని సహకరిస్తున్నాయి. పట్టిందల్లా బంగారమవుతోంది. దేశవ్యాప్తంగా తన విద్యాసంస్థలను విస్తరిస్తున్నారు మల్లారెడ్డి. అంతటితోనే ఆగడం లేదు. 70 సంవత్సరాల వయసులో కూడా యువకుడి లాగా రెచ్చిపోతున్నారు. ఇది మామూలు విషయం కాదంటూ” నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# అద్భుతమైన ఆయిల్ పామ్ రిఫైనరీ

మెదక్, మార్చి 16, తెలంగాణ ప్రభుత్వం సిద్దిపేట జిల్లా నర్మెటలో రూ.300 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోనే అతిపెద్ద ఆయిల్‌పామ్ రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 22న సీఎం రేవంత్ రెడ్డి ఈ రిఫైనరీని ప్రారంభించనున్నారు. మలేషియా సాంకేతికతతో నిర్మించిన ఈ ప్లాంట్ ద్వారా ముడి చమురును శుద్ధి చేసి నేరుగా వంట నూనెను ఉత్పత్తి చేయనున్నారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధరతో పాటు, సుమారు 1000 మందికి ఉపాధి లభించనుంది.తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీపి కబురు. ఇక నుంచి రాష్ట్రం పామాయిల్ తయారీ కేంద్రంగా మారనుంది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ రిఫైనరీ ఏర్పాటు చేసి నూనె ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 2.91 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, అప్పారావుపేటలలో ఆయిల్‌పామ్ శుద్ధి కర్మాగారాలున్నాయి. కొత్తగా నర్మెటలో రాష్ట్రంలోనే అతిపెద్ద కర్మాగారాన్ని రూ.300 కోట్లతో నిర్మించారు. ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ రిఫైనరీ ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఉన్న రెండు కర్మాగారాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ముడిచమురు మాత్రమే తీస్తున్నారు. దీనిని మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు తీసుకెళ్లి అక్కడి రిఫైనరీలలో నూనెలుగా తయారు చేసి దానిని పామాయిల్‌గా మారుస్తున్నారు.ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేసి విజయ నూనెలుగా మార్కెట్‌లో విక్రయిస్తోంది. రాష్ట్రంలో నూనెల తయారీకి రిఫైనరీ ఏర్పాటు అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నర్మెటలో దాని ఏర్పాటును ప్రతిపాదించగా సీఎం రేవంత్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న నర్మెట ఆయిల్‌పామ్ శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం రోజునే దానిని ఆనుకొని రెండు ఎకరాల స్థలంలో భారీ రిఫైనరీకి శంకుస్థాపన చేయాలని డిసైడ్ అయ్యారు. అనంతరం ఆరు నెలల్లో పూర్తి చేసి పామాయిల్ ఉత్పత్తి ప్రారంభిస్తారు.మలేసియా సాంకేతిక పరిజ్ఞానంతో నర్మెటలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యా?క్టరీలో గెలల క్రషింగ్ మొదలుకానుంది. గంటకు 30 టన్నుల సామర్థ్యంతో క్రషింగ్ చేపట్టనున్నారు. దీన్ని దశలవారీగా రోజుకు 120 నుంచి 600 టన్నులకు పెంచే వీలుంది. పరిశ్రమకు అవసరమైన విద్యుత్తును గెలల వ్యర్థాలతోనే ఉత్పత్తి చేసేందుకు గాను నాలుగు మెగావాట్ల ప్లాంటును ఇక్కడే ఏర్పాటు చేశారు. సమీపంలోనే 10 కోట్ల లీటర్ల నీటిని నిల్వచేసే రిజర్వాయరును సైతం నిర్మించారు. నీరు వృథా కాకుండా.. రీసైక్లింగ్ పద్ధతిలో వినియోగించనున్నారు. ఈ రిఫైనరీ ప్రారంభంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1000 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రైతులకు సైతం సరైన మద్దతు ధర లభించనుంది.

# అత్తాపూర్ లో 500 కోట్ల భూమి స్వాధీనం

హైదరాబాద్, మార్చి 16 టర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా హైడ్రా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే వేల కోట్ల విలువైన భూములను కాపాడి ప్రభుత్వానికి అప్పగించింది. తాజాగా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌బాగ్‌లో రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా సిబ్బంది కాపాడారు. 6,427 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయగా.. స్పెషల్ ఆపరేషన్ చేపట్టి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తు మధ్య ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించారు. అనంతరం ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.రెండ్రోజుల క్రితం శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురంలో పార్కును హైడ్రా కాపాడింది. తమ కాలనీలోని 400ల గజాల పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు గతంలో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి హద్దులు నిర్ధారించారన్నారు. ఆ ప్రహరీనే పునాదులుగా చేసి ఇల్లు కట్టడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. జీహెచ్ఎంసీ అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లే ఔట్ ప్రకారం పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఈ మేరకు ఆక్రమణలు తొలగించి 400ల గజాల స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీని విలువ రూ. 2 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కును కాపాడిన హైడ్రాకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.ఇక ఔఖీూఅ అందిస్తున్న ఉపగ్రహ ఆధారిత డేటా ఊజఆఖీంకు వజ్రాయుధం లా మారిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలకు సంబంధించిన సమాచారం ఒక్కో విధంగా ఉందని.. ఇలాంటి సమయంలో ఎన్ఆర్ఎస్‌సీ డేటా దిక్సూచిలా మారిందన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణలోనే కాదు.. ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల లెక్క తేల్చడంలో కూడా ఈ డేటా హైడ్రాకు ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు.

# రాజధానిలో హెచ్వోడి టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం

**టవర్ -1 కు మొదటి స్టీల్ డయాగ్రిడ్ ను అమర్చే పనులను ప్రారంభించిన మంత్రి నారాయణ**

**డయాగ్రిడ్ విధానంలో ఐదు ఐకానిక్ భవనాలు నిర్మిస్తున్న ప్రభుత్వం**

అమరావతి మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతిలో జీఏడీ,హెచ్ ఓడీ లకు మొత్తం 5 టవర్లు డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మిస్తున్నాం. జీఏడీ టవర్ మొత్తం 47 అంతస్తులతో మిగిలిన టవర్లు 40 అంతస్తులతో నిర్మిస్తున్నాం. మొత్తం 53 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో 5 టవర్లు నిర్మాణం చేస్తున్నామని అన్నారు.అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా టవర్ల నిర్మాణం ప్లాన్ చేసాం. ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఒకేచోట అన్ని కార్యాలయాలు ఉండేలా డిజైన్ చేశాం. 2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తాం. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ట్రంక్ రోడ్లు,లేఅవుట్ రోడ్లతో పాటు ప్రయివేట్ సంస్థల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. రైతులకు మాట ఇచ్చిన విధంగా అమరావతి రాజధాని నిర్మిస్తామని అన్నారు.

# 'కళారత్న నేషనల్ అవార్డ్" అందుకున్న నక్క పోచ రాజయ్య ( నక్క రాజు)

### బహుజన సాహితీ వేత్తలను గుర్తించడమే మన బి.ఎస్.ఎ. లక్ష్యం
### - సౌత్ ఇండియా నేషనల్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ
### - తెలంగాణ అమర వీరుల త్యాగాలను చాటి చెప్పిన డా.దరువు ఎల్లన్న



జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నక్క పోచ రాజయ్య (నక్క రాజు) ఆదివారం సాయంత్రం తిరుపతి లోని జి.ఎస్.కె.ఆర్. భవన్ లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా "కళారత్న నేషనల్ అవార్డ్" అందుకున్నారు.బహుజన జాతీయవాది మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి సందర్భంగా తిరుపతిలో 18వ జాతీయ స్థాయి సాహితీ వేత్తల సదస్సు, అవార్డుల ప్రధానోత్సవ సభను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు.దాదాపు గత రెండు దశాబ్దాలుగా నక్క పోచ రాజయ్య (నక్క రాజు)చేస్తున్న కళా ప్రదర్శనలు, ఆధ్యాత్మిక, ఉద్యమ కళా ప్రదర్శనలు, 24 గంటల నిర్విరామ గాన స్వరాభిషేకం, తెలంగాణ ఉద్యమ కారునిగా అందించిన ఉద్యమ కార్యక్రమాలు, నేటికీ సమాజ హితం కోసం ఆయన చేస్తున్న ప్రజా అవగాహన కార్యక్రమాలను, సదస్సులను, యువత గంజాయి, డ్రగ్స్ లకు అలవాటు పడుతున్న నేపథ్యంలో వాటి నివారణ కోసం సదస్సులు, మహిళలకు, బాలికలకు భరోసా లాంటి కార్యక్రమాలను నిర్వహించడం లాంటి అతని గొప్ప కలలను గుర్తించి ఈ "కళారత్న నేషనల్ అవార్డ్" అందించడం జరిగిందని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల డెలిగెట్స్ తో పాటు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన బహుజన సాహిత్య అకాడమీ ప్రతినిధులు, పలువురు ప్రముఖులతో పాటు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటి మెంబర్ డా.దరువు ఎల్లన్న, తెలంగాణ రాష్ట్ర కో – ఆర్డినేటర్ విష్ణు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కనుకుట్ల విజయ కుమార్,ప్రముఖ అంబేద్కరిస్ట్ ఉద్యమ నాయకులు మామిడిపల్లి బాపన్న, ప్రముఖ రచయిత, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.డి.వెంకమ్మ, కేరళ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కళారాణి, తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి రాజేషన్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఎన్. వర ప్రసాద్ లతో పాటు వివిధ రాష్ట్రాల, జిల్లాల బాధ్యులు, జాతీయ అవార్డుల సెలెక్షన్ కమిటి సభ్యుడైన సేవా రత్న అవార్డు గ్రహీత, ప్రముఖ ఉద్యమ కారులు చుక్క గంగారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్లో తీరనున్న గ్యాస్ కష్టాలు
## ఖతార్ నుంచి భారత్కు చేరుకున్న శివాలిక్ నౌక

ముంబాయి ఇరాన్ హర్మూజ్ జలసంధి దాటి గుజరాత్లోని ముంద్రా పోర్టుకు శివాలిక్ నౌక చేరుకుంది. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యంలోని ఎల్పీజీ ట్యాంకర్ నౌక శివాలిక్లో సుమారు 40 నుంచి 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ ఖతార్లోని రాస్ లఫాన్ ఓడరేవు నుండి శివాలిక్ బయలుదేరింది. హర్మూజ్ జలసంధి నుంచి ప్రయాణం చేసింది. సోమవారం నాడు గుజరాత్ రాష్ట్రం కచ్ జిల్లాలోని ముంద్రా ఓడరేవుకు చేరుకుంది. రాస్ లఫాన్ నుండి బయలుదేరిన మరో నౌక నందా దేవి ఇప్పటికే గుజరాత్ తీరానికి దూరంగా ఉంది. మంగళవారం ఉదయం 6:30 గంటలకు గుజరాత్లోని కాండ్లా ఓడరేవుకు చేరుకుంటుందని అంచనా. ఈ రెండు నౌకలు కలిపి తీసుకున్న వస్తున్న ఎల్పీజీ గ్యాస్ 92,700 మెట్రిక్ టన్నులు.

# ఉప్పల్ కానిస్టేబుల్ హత్య కేసు
## ఇద్దరు నిందితుల అరెస్టు

ఉప్పల్ చిలకనగర్ హత్య కేసును 8 గంటల్లో ఉప్పల్ పోలీసులు ఛేదించారు. ఉప్పల్ లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ సురేష్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం రాత్రి 8 సమయంలో 100 కాల్ ద్వారా సమాచారం వచ్చింది. చిలకనగర్ ప్రాంతంలో పారువుల సుధీర్ కుమార్ను కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం వచ్చింది. సుధీర్ కుమార్ ను హత్య చేసిన ప్రధాన నిందితుడు బనోతు సంతోష్ లు 7సంవత్సరాలుగా స్నేహితులు. వీరి మధ్య మూడు రోజుక క్రితం నుండి విభేదాలు ఏర్పడ్డాయని అన్నారు.

మార్చి 15న సాయంత్రం సమయంలో సంతోష్ తన స్నేహితుడు పొడిశెట్టి తరుణ్తో కలిసి సుధీర్ కుమార్ను చిలకనగర్ గ్రౌండ్ వద్దకు పిలిచారు. సుధీర్ తన స్నేహితుడు ఇమ్రాన్ ఖాన్తో కలిసి అక్కడికి వెళ్లిన తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో సంతోష్ కత్తితో సుధీర్పై దాడి చేయాగా, సంతోష్ పారిపోవడానికి తరుణ్ తోడయ్యాడు. సుధీర్ అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ సంతోష్ వెంబడించి పలుమార్లు కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, కేవలం 8 గంటల్లోనే ప్రధాన నిందితుడు బనోతు సంతోష్, అతని సహచరుడు పొడిశెట్టి తరుణ్ను అదుపులోకి తీసుకున్నాము. నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక యాక్టివా మోటార్ సైకిల్, వారి దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని అన్నారు.

# గన్ పార్క్ లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిరసన

హైదరాబాద్ రైతులకు వెన్నుపోట్లు.. రాహుల్ గాంధీకి వెయ్యి కోట్లు అంటూ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్, అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేసారు. ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి గవర్నర్ ప్రసంగంలో ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కల్పిస్తామని చెప్పారు. ఇప్పుడు మూడో గవర్నర్ ప్రసంగం అవుతుంది.. రెండున్నర సంవత్సరాలు గడిచిపోయింది. ఇప్పటికి ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కల్పించలేదని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు కనీసం బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితుల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అంటే దానికి కారణం ఫైనాన్సియల్ మిస్మేనేజ్మెంట్. తెలంగాణను ఒక ఏటీఎం లాగా మార్చి ఏఐసీసీ పెద్దలకు సమర్పించుకునే శ్రద్ధ ఈ రాష్ట్ర ప్రజల మీద లేదు, ఈ శాసనసభలో, శాసనమండలిలో తప్పకుండా ప్రతి పేదవాడి తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. తరువాత ఆరు గ్యారంటీలు అమలు చేయాలని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి శాసనసభ, మండలికి హాజరైయారు.

## లాయర్ల రక్షణ చట్టం కోసం ఇందిరా పార్కు వద్ద దీక్ష

హైదరాబాద్: న్యాయవాదుల భద్రత కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ఈ దీక్షకు మద్దతు తెలిపారు. ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైకోర్టు అడ్వకేట్ బి.ఆర్. కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే లాయర్ల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, వారికి రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యతని నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంజనేయులు గౌడ్ తో పాటు పలువురు హైకోర్టు న్యాయవాదులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

### నా భర్త నాకు కావాలి....
### భర్త కోసం భార్య పోరాటం.

తాడేపల్లి కుంచనపల్లిలోని భర్త నివాసం ముందు కుటుంబ సభ్యులతో కలసి భార్య నిరసన కు దిగింది. కాపురానికి తీసుకువెళ్లాలని భర్త ఇంటి ముందు ధర్నా చేసింది. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన చైతన్య అనే యువతితో గుంటూరు జిల్లా మందడంకు చెందిన యర్రంనేనీ విజయ్ తో 2017లో వివాహం జరిగింది. ప్రెగ్నెన్సీ రావడంతో తనకు ఇష్టం లేని పెళ్లి చేశారంటూ... పెళ్లి అయిన 8 నెలలకే భార్య చైతన్యను భర్త విజయ్ వదిలేసాడు. భర్త కోసం 8 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న తనకు అత్తమామలు న్యాయం చేయడం లేదని భార్య ఆవేదన చెందుతోంది. తమకు పుట్టిన బిడ్డకు న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు ధర్నా కు దిగింది. భార్యను కాపురానికి తీసుకువెళ్లాలని న్యాయస్థానం నుంచి ఆర్డర్ వచ్చిన కోర్టు ఆర్డర్ ను భర్త, అత్తమామలు పట్టించు కోవడంలేదని అంటోంది. వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనని , బిడ్డని పట్టించుకోవడం లేదని ఆరోపించింది.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్డీపీవో



చిత్తూరు 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణములోని పలు స్కూళ్ళ పరీక్షా కేంద్రాలను చిత్తూరు ఎస్డీపివో టి.సాయినాథ్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా అధికారులు జిల్లా అంతటా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

సోమవారం నుండి 10వ తరగతి వారికి పరీక్షలు మొదలైన సందర్భంగా చిత్తూరు ఎస్డీపీవో పట్టణములోని శ్రీచైతన్య, నారాయణ, లిటిల్ ఫ్లవర్ మరియు గిరింపేట లోని మునిసిపల్ హై స్కూల్స్ ల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా హాల్లు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

టి. సాయినాథ్ మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ తరపున పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేకంగా పోలీసులు పర్యవేక్షణ కొనసాగిస్తారని చెప్పారు.

# మెడికల్ కాలేజీలో భారీ అగ్నిప్రమాదం

కటక్ కటక్లోని ఎస్సీబీ మెడికల్ కాలేజ్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ట్రామాకేర్ విభాగంలో మంటలు చెలరేగి, పది మంది మృతి చెందారు. ప్రమాదంలో మరో 11 మందికి గాయాలు అయ్యాయి. సిబ్బంది రోగులను రక్షించి ఇతర వార్డులకు తరలించారు. దట్టమైన పొగతో 23 మంది సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదంపై ఒడిశా సీఎం మోహన్ చరణ్గ్ర్భ్రాంతి వ్యక్తం చేసారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ప్రకటించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను సీఎం పరామర్శించారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు సీఎం ఆదేశించారు.

# మొబైల్ ఫోన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఏలూరు నగరంలో మరోసారి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మొబైల్ యాక్సెసరీస్ దుకాణాలపై సోమవారం దాడులు నిర్వహించారు.ఏలూరు ఆర్ ఆర్ పేట లోని మహదేవ్ మొబైల్స్ లో ఒరిజినల్ పేరుతో డూప్లికేట్ అమ్ముతున్నారు అన్న సమాచారంతో ఆ దుకాణంలో ప్రస్తుతం తనిఖీలు నిర్వహిస్తున్నారు. సెల్ ఫోన్ యాక్సెసరీస్ కు సంబంధించిన బిల్లులను ఒరిజినల్ సామాగ్రి వివరాలను వారు సేకరిస్తున్నారు తనిఖీలు కొనసాగుతున్నాయి

## బడంగ్ పేట్ మునిసిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

రంగారెడ్డి బడంగ్పేట్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఏసీబీ హైదరాబాద్ రేంజ్ టు డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సర్ప్రైజ్ చెకింగ్ జరిగింది. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలపై దాడులు జరిపారు. ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

# ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా

కూకట్ పల్లి ఎంఈఓ కార్యాలయం ఎదుట టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ నేతలు ధర్నా కు దిగారు. న్యూ ఏరా హై స్కూల్ విద్యాశాఖ అధికారితో కలిసి కుమ్మక్కయ్యారంటూ ఆరోపించారు. న్యూ ఎరా స్కూల్ ర్యాంకుల కోసం సెల్ఫ్ సెంటర్లు వేయించుకున్నారని టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ ధర్నా చేసారు. మేడ్చల్ జిల్లా డీఈవో, ఎంఈఓ లంచాలు తీసుకుంటూన్నారని టిపివైఎఫ్, యుఎస్ఎఫ్ఐ నినాదాలు చేసారు. ఏరా హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని మార్చాలని డిమాండ్ చేసారు. ఈ తప్పిదానికి పాల్పడిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# పెండింగ్ బిల్లులకోసం అసెంబ్లీ ముట్టడి
## మాజీ సర్పంచుల అరెస్టు

హైదరాబాద్ సర్పంచుల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచుల సంఘం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ర్యాలీగా వచ్చిన మాజీ సర్పంచ్లను నాంపల్లి గాంధీభవన్ వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తమ సొంత డబ్బులతో మాజీ సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేసిన నిధులను తక్షణమే మంజూరు చేయాలని జేఏసీ చైర్మన్ సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు... మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించే విధంగా పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. 2019 నుంచి 2024 వరకు గ్రామాలలో మాజీ సర్పంచులు వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామాలలో అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక అనేకమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా జీవో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# మేడ్చల్ జిల్లాలో తాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

మేడ్చల్ జీహెచ్ఎంసీ పరిధిలోని 297, 298 డివిజన్లలో మేడ్చల్, పూడూరు, కిష్టాపూర్ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సరైన పరిష్కారం చూపలేదని మండిపడ్డారు.గత తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు తాగునీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటినుంచి పట్టణ ప్రజలకు నీటి సమస్యలు మొదలయ్యాయి అన్నారు. పట్టణ చుట్టుపక్కల గ్రామాల్లో అవసరానికి మించి నీటి సరఫరా జరుగుతుంది కేవలం మేడ్చల్ పట్టణానికే ఈ సమస్య ఎందుకు వొస్తుంది అని ప్రశ్నించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఖాళీ బిందెలతో పాదయాత్రగా వచ్చి అసెంబ్లీని ముట్టడిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# పెట్రోల్ పంపుల్లో నో స్టాక్
## రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పెట్రోల్ పంపులు

ఇబ్రహీంపట్నం: పెట్రోల్ పంపుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పెట్రోల్ పంపుల్లో సోమవారం స్టాక్ లేకపోవడంతో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మొత్తం 10 పెట్రోల్ పంపుల్లో మొత్తం నా స్టాక్ బోర్డులు పెట్టి బంద్ చేశారు.వాహనదారులు వివిధ పనులపై వెళ్లేవారు పెట్రోల్ డీజిల్ లేక ఇబ్బందులకు గురైతున్నారు. పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని అధికారులు చెప్తున్నప్పటికి పెట్రోల్ పంపుల్లోస్టాక్ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఐ ఎన్ టి ఎస్ లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల అద్భుత ప్రతిభ



**ప్రజాబలం ప్రతినిధి వేములాడ మార్చి- 16**వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య విద్యార్థులు ఐ ఎన్ టి ఎస్ లో అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. విద్యార్థుల ప్రతిభకు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులైన కొమ్ము అక్షయ్, వరుణ్ కరీంనగర్ జోన్ లెవెల్ లో స్పెషల్ ప్రైస్ ల్యాప్టాప్ ను జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలతో క్రీడల్లో రాణిస్తేనే మంచి అవకాశాలు వస్తాయని విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ సుదేష్ కుమారీ మాట్లాడుతూ పిల్లలకు ఒలంపియాడ్ ఎగ్జామ్స్ ఎలా ఉంటాయో ఇప్పటినుండి తెలియజేయడం అన్నది శ్రీ చైతన్య విద్యా సంస్థలు విద్యార్థులకు అందిస్తున్నటువంటి ఒక గొప్ప ప్రోగ్రాం ఈ ప్రోగ్రాం లో పాల్గొన్న పిల్లలందరూ భవిష్యత్తులో ఇలాంటి కాంపిటీషన్ ఎగ్జామ్స్ అయినా కూడా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్రకోల రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్స్ ప్రవీణ్ మమతా, డిన్ అంజయ్య ప్రైమరీ ఇంచార్జ్ రజిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్ , పిటి సుధాకర్, మారుతి, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లడ్డు ప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేసిన రాజన్న ఆలయ ఈవో



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లడ్డు ప్రసాద తయారీ కేంద్రాన్ని ఆలయ ఈవో ఎల్ రమాదేవి సోమవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డు ప్రసాదం తయారీ విధానం, బరువు, నాణ్యత ప్రమాణాలను ఆమె పరిశీలించారు. భక్తులకు అందించే ప్రసాదం శుభ్రతతో, నాణ్యతతో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వంటశాలలో పనిచేస్తున్న సిబ్బంది హెడ్ క్యాప్స్, శుభ్రత నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఫైర్ ఎక్స్టింగ్విషర్లు సరిగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని కూడా పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల సమయంలో ఆలయ ఏఈఓ శ్రావణ్,ఆలయ సిబ్బంది ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యానికి రూ. 21.50 లక్షలతో కొత్త వాహనాలు



**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ మార్చి- 16** వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా సుమారు 21.50 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు ఒక వాటర్ ట్యాంకర్ ట్రాలీని సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపాలిటీకి ఇప్పటివరకు 6 ట్రాక్టర్లు ఉండగా, చెత్త సేకరణకు మరిన్ని వాహనాలు అవసరమని గుర్తించి వీటిని సమకూర్చుకున్నామని పట్టణంలోనీ ప్రజలు నివాస గృహాలు పెరుగుతున్న తరుణంలో చెత్త సేకరణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి దిశగా పోతున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్ , కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ 57 వేల మందికి పైగా దర్శనం






**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ మార్చి -16** వేములవాడ దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ ఉదయం నుండి సాయంత్రం 5:40 గంటల వరకు స్వామివారిని మొత్తం 57,489 మంది భక్తులు దర్శించుకున్నారు. అలాగే స్వామివారికి 4,911 కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

ఉదయం వేళ భక్తులు స్వామివారికి కోడె మొక్కులు సమర్పించి, అభిషేకాలు, అన్నపూజలు, నిత్య కళ్యాణం, కుంకుమ పూజ, చండీ హోమం, సత్యనారాయణ వ్రతం, మహాలింగార్చన వంటి వివిధ సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# గ్యాస్ బండ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న గృహిణిలు

### గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర గ్యాస్ కొరత
### ఈ సమస్య పరిష్కారం అయ్యేది ఎప్పుడు
### ప్రజల సమస్యలు తీర్చడంలో అధికార పార్టీ తీవ్ర విఫలం







**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 16 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఆందోల్ నియోజకవర్గం లోని ఉమ్మడి పుల్కల్ మండలంలో, నూటికి 99% గృహిణులు గ్యాస్ పై ఆధారపడి ఉన్నారు, ఇటీవల తమకు సకాలంలో గ్యాస్, అందకపోవడంతో, తాము తీవ్ర ఇబ్బందులకుగురవుతున్నామని, ఆయా గ్రామాల గృహిణులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటివరకు లేని గ్యాస్ కొరత, కేవలం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే, ఎందుకు గ్యాస్ కొరతా సృష్టిస్తున్నారని, ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు, అంతేకాకుండా తమ పుల్కల్ మండలంలో ఉన్న, భారత్ గ్యాస్ యజమాని, సిబ్బంది, గ్యాస్ వినియోగదారుల పట్ల, అవహేళనగా మాట్లాడడం, ఎంతవరకు సమంజసం అని, పలువురు గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా భారత్ గ్యాస్ సిబ్బంది, తమ తీరును మార్చుకోకపోతే, పరిణామాలు వేరే విధంగా ఉంటాయని పలు గ్రామాల లబ్ధిదారులు, అంటున్నారు, ఈ విషయం ఇలా ఉంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో, ఇరాక్, ఇరాన్,దేశాల్లో యుద్ధం నడవడం వల్ల, ఆ దేశాల నుంచి వచ్చే గ్యాస్, పెట్రోల్, డీజిల్, లాంటి దిగుమతులను, వారు నిలిపివేయడంతో, మనకు వచ్చే గ్యాస్,పెట్రోల్,డీజిల్, వస్తుందా లేదా, ఈ విషయంపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని, సామాన్య గ్రామీణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, అధికారంలో ఉన్న పార్టీ నాయకులు స్పందించి, సమస్య పరిష్కరించి గ్యాస్ సరఫరా చేయాలని,,పలు గ్రామాల ప్రజలు కోరుతున్నరు, తమకు సకాలంలో గ్యాస్ అందకపోతే, తమ పరిస్థితి ఏంటని, కొన్ని గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు, ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాము ఆదుకుంటామన్నమాట, ఎక్కడికి వెళ్లిందని పలువురు అంటున్నారు, ఇప్పటికే గ్యాసు లేక తాము కట్టెల పొయ్యి మీద వంటలు చేసుకుంటున్నామని, పలు గ్రామాల మహిళలు అంటున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, సకాలంలో తమకు గ్యాస్ ను, అందించే విధంగా, చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు, లేనియెడల, అన్ని గ్రామాల ప్రజలు ఏకమై, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని, వారు అన్నారు....

# జెవివి ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మోరంపూడి సత్యనారాయణ మృతి




**ఖమ్మం ప్రతినిధి మార్చి 16 (ప్రజాబలం)** ఉమ్మడి ఖమ్మం జిల్లా జన విజ్ఞాన వేదిక మాజీ ప్రధాన కార్యదర్శి మోరంపూడి సత్యనారాయణ సోమవారం మృతి చెందారు.. ఆయన మృతికి జెవివి జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం తెలిపింది. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపింది సత్యనారాయణ జన విజ్ఞాన వేదిక పర్యావరణం, వ్యవసాయ వ్యవసాయం సబ్ కమిటీ కన్వీనర్ గా నూతన వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయడంతో పాటు తన సొంత వ్యవసాయ క్షేత్రంలో నూతన వంగడాలు నూతన పద్ధతులను అమలు చేసేవారు. అలాగే బిటి పత్తి విత్తనాలను వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణుగోపాలరావు సహకారంతో తయారు చేయించి కేజీ కేవలం 100 రూపాయలకే మన జిల్లా రైతులకు అందజేశారు. 1990 నుండి నిర్వహించబడిన అక్షరాస్యత ఉద్యమంలో జోనల్ కోఆర్డినేటర్ గాను, రిసోర్స్ పర్సన్ గాను బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వేలాది మందిని అక్షరాసులుగా చేయడంలో తన వంతు పాత్రను పోషించారు. తల్లాడ ,కల్లూరు ప్రాంతాల్లో ఐక్య ఉపాధ్యాయ ఉద్యమ ప్రారంభకులలో ఆయన ఒకరు. గణిత ఉపాధ్యాయుడుగా, ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈఓ గా తన బాధ్యతలను అత్యంత క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా నిర్వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక మార్పుకు రాజకీయ రంగంలో కూడా తన వంతు కృషి చేశారు. వారి లేని లోటు జన విజ్ఞాన వేదిక్కు భర్తీ చేయలేనిదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.మోహన్ కే రామారావు పేర్కొన్నారు ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేసారు. వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు

# బుద్దానగర్ లో తలసాని పర్యటన ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సోమవారం ఆయన అమీర్ పేట లోని బుద్దానగర్ లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నూతనంగా చేపట్టిన స్ట్రామ్ వాటర్ లైన్ పనులను పరిశీలించారు. స్ట్రామ్ వాటర్ లైన్ నిర్మాణ పనులు సక్రమంగా జరగడం లేదని, లెవెల్స్ ప్రకారం పైప్ లైన్ ఏర్పాటు చేయడం లేదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు వివరించారు. నిర్మాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్ లో తాము ఇబ్బందులకు గురి కావాల్సి ఉంటుందని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్ట్రామ్ వాటర్ లైన్ పనుల తో డ్రైనేజీ లైన్ కూడా దెబ్బతిన్నదని, మరమ్మతులు చేసేలా చూడాలని కోరారు. అదేవిధంగా తమ కాలనీలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్ట్రామ్ వాటర్ లైన్ పనుల అనంతరం ఇబ్బందులు తలెత్తకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా దెబ్బతిన్న డ్రైనేజీ లైన్ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. స్ట్రామ్ వాటర్, డ్రైనేజీ లైన్ లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాతనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ స్తంభాలు కూడా వెంటనే ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా అభివృద్ధి పనులలో అధికారులకు తమవంతు సహకారం అందించాలని చెప్పారు. తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న విషయం నియోజకవర్గ ప్రజలకు అందరికీ తెలిసిందేనని చెప్పారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 16 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారం పై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్యతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ యూనియన్ ప్రతినిధులు దేవేందర్,రజిత తమ దరఖాస్తులో ఎం సి సి ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ లకు గత 10 నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను ప్రస్తుత నిత్యవసరాల దృష్ట్యా పరిశీలించి అందించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని 17వ వార్డు షంషేర్ నగర్ స్కూల్ చెందిన లక్ష్మణరావు తమ ప్రాంతంలోని ప్రభుత్వ వాటర్ ట్యాంక్ ను మున్సిపల్ అధికారుల సమన్వయం లేకుండా కూల్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్జి సమర్పించారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన కోట లక్ష్మి తన భర్త వికలాంగుడని, తన కుమారుడు 7వ తరగతి చదువుతూ గురుకుల పరీక్ష రాసాడని,సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.



జిల్లాలోని కొత్తూరు గ్రామ రైతులు తాము గత సీజన్ లో పండించిన సన్న రకం వడ్లు కొనుగోలు కేంద్రాలలో విక్రయించామని, ఇందుకు గాను బోనస్ డబ్బులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.తాండూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన మహమ్మద్ ముజాహద్ హుస్సేన్ గ్రామ శివారులో తనకు గల భూమి నుండి కొంత భాగాన్ని ఇతరుల పేరుట అక్రమంగా పట్టా చేశారని, ఈ పట్టాను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.దండేపల్లి మండలం రెబ్బెనపల్లి మత్స్య సహకార సంఘం సభ్యులు ఎన్నికలను నూతన సభ్యుల పేర్లు నమోదు చేసే వరకు నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన ఆలం మల్లేష్ తమ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూమిని వారు మరణించినందున వారసలమైన తమ పేరిట మార్చాలని కోరుతూ అర్జీ సమర్పించారు.జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన దుర్గమ్మ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు




అనంతరం ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా కార్యాలయాల సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని,వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని తెలిపారు.వెనుకబడిన తరగతులు,షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగల వసతి గృహాలలో ఏమైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలపై దృష్టి సారించాలని, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాలలో వరదల కారణంగా ఇబ్బందులకు గురయ్యే గృహ నివాసాలను గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమర్పించే నివేదికల ఆధారంగా ప్రజా ప్రయోజనార్ధం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా కానుకలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 16** :రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ట్రైని డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ,జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి,జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్,జిల్లా పౌర సంబంధాల అధికారి కృష్ణమూర్తి,



మండల తహసిల్దార్ రఫతుల్లా, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి 3 లక్షల రూపాయలు అందించడం జరిగిందని,త్వరలో తోఫా కిట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ మత సామరస్యంతో సమాజాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖలఅధికారులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# మిని లెదర్ పార్క్ ప్రారంభించాలని ఎండి ప్రశాంత్ కుమార్ కు వినతి పత్రం అందజేసిన సొసైటీ నాయకులు




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మార్చి 16** జమ్మికుంట మినీ లెదర్ పార్క్ వెంటనే ప్రారంభించాలని మలుపు చర్మకారుల వెల్ఫేర్ సొసైటీ సంఘం గౌరవ అధ్యక్షులు ఆరెపల్లి రాజేందర్, ములుగు రాజు ఆదేశాల మేరకు అధ్యక్షులు రామంచ రాజారాం కమిటీ సభ్యులతో కలిసి లిడ్ క్యాప్ ఎండి ప్రశాంత్ కుమార్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా వచ్చిన ఎండి ప్రశాంత్ కుమార్ జమ్మికుంట మినీ లెదర్ పార్కును సందర్శించగా చర్మకారుల అభివృద్ధి కొరకు పార్కును వెంటనే ప్రారంభించాలని అందులో ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించి మాస్టర్ ట్రైనర్స్ కు ఉపాధి పొందేలా చూడాలని వినతి పత్రం అందజేశామన్నారు ఎండి ప్రశాంత్ కుమార్ సానుకూలంగా స్పందించి త్వరలోనే ప్రారంభించేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి రమేష్ ,జన్నె కొండయ్య ,గంగారపు శ్యాము, చిట్యాల మొగిలి, ఈదునూరి సరోజన,మడిపల్లి లక్ష్మి, మడిపల్లి సమ్మక్క తోపాటు సభ్యులందరూ పాల్గొన్నారు.

# మస్జిద్ కు మైక్ సెట్ అందించిన కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి మార్చి**జమ్మికుంట దారు సలాం మస్జిద్ కు నూతన మైక్ సెట్ అందించిన ఆరో వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు సోదరీమణులు పవిత్రమైన ఉపవాసలు ఉంటారు. జమ్మికుంట హౌసింగ్ బోర్డ్ కాలనీలో కులమతాలకు అతీతంగా అందరం కలిసి మెలిసి పండుగలు చేసుకుంటామని మస్జిద్ లో ఏమైనా కోరికలు కోరుకుంటే వెంటనే జరుగుతాయని ఒక నమ్మకం అని అన్నారు.అనంతరం ముస్లిం మత పెద్దలు శ్రీపతి స్వర్ణలత నరేష్ లకు కౌన్సిలర్ శాలువా దండలతో సత్కరించడం జరిగింది.

# ఇళ్ల స్థలాలకై ఖమ్మం జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలు

### యూనియన్ల కతీతంగా హాజరై మద్దతు తెలిపిన సీనియర్ జర్నలిస్టులు

### ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్

### ఖమ్మం ప్రెస్ క్లబ్లో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

**ఖమ్మం ప్రతినిధి మార్చి 16 (ప్రజాబలం)** జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఖమ్మం జర్నలిస్టులు కొరకొప్పుల రాంబాబు, టిఎస్ చక్రవర్తి లు ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకై ఖమ్మం ప్రెస్ క్లబ్లో సోమవారం రిలే నిరాహార దీక్షలు ఉదయం 10 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5గంటకు ముగించారు. తిరిగి మంగళవారం ఉదయం 10 గంటలకు రిలే












నిరాహారదీక్ష ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు కొరకొప్పుల రాంబాబు, టిఎస్ చక్రవర్తి లు మాట్లాడుతూ.. ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించబడిన 23.02 ఎకరాల భూమిని సొసైటీలో సభ్యత్వం కలిగిన 320 మంది జర్నలిస్టులకు 200 గజాల చొప్పున వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షకు పలువురు సీనియర్ జర్నలిస్టులు ప్రజా సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సంక్షేమానికి పాటుపడే జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల చేత లబ్ధి చేకూరే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జర్నలిస్టులకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఇళ్ల స్థలాల కోసం భూధాన్ భూమి, వెలుగుమట్ల పేద ప్రజలు సాధించిన పోరాటంను జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకొని పోరాటం చేయాలని కోరారు సంఘీభావం తెలిపిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు పాలకుర్తి కృష్ణ, పూలే అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దామాల సత్యనారాయణ ఉద్యమ కారుల ఆకాంక్ష వేదిక బట్టు రాజేందర్ నాయక్ డెస్క్ జర్నలిస్ట్ నాయకులు కేతిరెడ్డి అచ్చిరెడ్డి సీనియర్ జర్నలిస్టులు కట్టెకోల చిన్న నర్సయ్య, పసుపులేటి సత్యనారాయణ అమరవరపు కోటేశ్వరరావు, ఉపేందర్, భద్రయ్య, ఉత్కంఠం శ్రీనివాస్ సామ్రాట్ గుప్త పులి శ్రీనివాస్ దండాల ప్రభాకర్ రెడ్డి తనగం బిక్షం కూరపాటి నరేష్ కిరా9 రమేష్ డాక్టర్ లింగయ్య డాక్టర్ చిన్ని, మంద వెంకటేశ్వర్లు, పెంటి వెంకటేశ్వర్లు, నవాజీవన ప్రియా పొస్ట్ న్యూస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణిలో 114 దరఖాస్తులు.

## అదనపు కలెక్టర్ లోకల్ బాడి మధుమోహన్.



**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి** ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని 25వ నంబర్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ మధుమోహన్ పాల్గొని దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారుల నుండి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు.

ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 114 వచ్చాయని , అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సీఈఓ చందర్, చాశీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 2027 జనాభా లెక్కలపై అవగాహన కార్యక్రమం



**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రెండవ రోజు సంబంధిత అధికారులకు ట్రైనర్లు డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ కార్యాలయం నుండి డి. వెంకట రమణ , వి. రాజ్‌కుమార్ లు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

2027 జనాభా లెక్కల నిర్వహణలో భాగంగా సంబంధిత అధికారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనాభా లెక్కల నిర్వహణ విధానం, చట్టపరమైన నిబంధనలు , అధికారుల బాధ్యతల పై వివరంగా తెలియజేశారు.

ఈ సందర్భంగా 2027 జనాభా లెక్కల పరిచయం, జనాభా లెక్కల అధికారుల పాత్ర, చట్టపరమైన నిబంధనలు, నిధుల నిర్వహణ, మానవ వనరుల వినియోగం ప్రచార కార్యక్రమాలపై ట్రైనర్లు వివరించారు. జనాభా గణనకు సంబంధించిన పునాదిని నిర్మించే విధానాలు, భావనలు, నిర్వచనాలు , సూూ అవలోకనం (ప్రశ్నలు 1 నుంచి 34 వరకు) గురించి అధికారులకు శిక్షణ అందించారు.

అలాగే జవీమీూ (Census Management & Monitoring System) పరిచయం చేస్తూ అందులోని మాడ్యూల్స్, నూదీ క్రియేటర్ , లేఅవుట్ మ్యాప్ తయారీ ద్వారా నూదీ కార్వింగ్ విధానం గురించి వివరించారు. CMMS ద్వారా శిక్షణ నిర్వహణ, నియామక లేఖలు , ఐడి కార్డుల తయారీ, ఐడి కార్డు జారీ, లాజిస్టిక్స్ , ప్రింటింగ్ నిర్వహణపై అధికారులకు అవగాహన. కల్పించారు.

అదేవిధంగా డేటా ఎంట్రీ మాడ్యూల్‌లో చేయవలసినవి , చేయకూడనివి, గ్రామం/పట్టణం/ఛార్జ్ రిజిస్టర్ల తయారీ, జవీమీ లో డాష్‌బోర్డ్‌ల వినియోగం వంటి అంశాలపై ట్రైనర్లు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా 2027 జనాభా లెక్కలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించబడుతున్నదని తెలిపారు. ఈ శిక్షణ లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, RDO వీణ, తహసిల్దార్ లు, ఎంపిడిఓ లు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 70 పబ్లిక్ టాయిలెట్ బ్లాక్‌లలో పరిశుభ్రత పనులు







**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, మార్చి 16, 2026 రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న 70 పబ్లిక్ టాయిలెట్ బ్లాక్‌లలో శుభ్రత, నిర్వహణ పనులు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా టాయిలెట్‌లలో పరిశుభ్రత పనులు, నిర్వహణ కార్యకలాపాలు చేపట్టి, వాటిని వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్లు, డీఈఈ-ఎస్‌డబ్ల్యూఎం, ఏఈ-ఎస్‌డబ్ల్యూఎం, ఎన్‌ఏసీ, ఎస్‌బీఎం నిపుణులు, ఐసీ-ఎస్ఎస్ పర్యవేక్షించారు.

# దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకం.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు. భారత జనాభా గణన - 2027 కి సంబంధించి, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో జనగణన ప్రక్రియ కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. అధికారులు చేపట్టే జనగణన ఆధారంగానే ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర ప్రజా ప్రయోజనాల రూపకల్పనలో జనగణన ప్రక్రియ ఆధారం అని అన్నారు. దేశాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే జనాభా గణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, గృహాల గుర్తింపు, జనగణన వివరాల నమోదులో తప్పులకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందించే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని వివరించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. జనగణన ప్రక్రియను బాధ్యతగా నిర్వర్తించి, విజయవంతం చేయాలన్నారు.

మాస్టర్ ట్రైనర్లు అధికారులకు జనగణనకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, సీపీఓ జీవరత్నం, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా పంపిణీ చేసిన మాజీ ఎంపీటీసీ ఎడ్ల సుగుణ రామ్ రెడ్డి







**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి మార్చి 15** యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బీర్ల ఫౌండేషన్ చైర్పర్ పర్సన్ బీర్ల అనిత వారి సౌజన్యంతో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు సోదరీమణులకు రంజాన్ తోఫా కాచారం గ్రామంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల సుగుణ రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దడిగే ఇస్తారు మాజీ ఎంపీటీసీ నమిలే అరుణ ఆంజనేయులు మాజీ కో-ఆపరేటివ్ డైరెక్టర్ ఒగ్గు లలిత మల్లయ్య వారి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరుల కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బీర్ల ఫౌండేషన్ చైర్పర్ పర్సన్ బీర్ల అనిత ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు అల్లా దయవల్ల ముస్లిం సోదరులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ న్యూ ఉస్మాన్ గంజ్‌లో ఇఫ్తార్ పార్టీ, భాగ్యనగర్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రిజ్వాన్ హుస్సేన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం (సుబ్బు ) తదితరులు పాల్గొన్నారు.

